www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# ప్రజా విశ్వంభర

అక్షరం సాక్షిగా...

బుధవారం 03 - 9 - 2025 సంపుటి : 1 సంచిక : 56 పేజీలు : 12 వెల : 5/- తెలంగాణ/ఆంధ్రప్రదేశ్




డా॥ కాచం సత్యనారాయణ
CMD



## ఎన్ని సవాళ్లెదురైనా..
## 7.8 శాతం వృద్ధి రేటు..

- దేశ ఆర్థిక వ్యవస్థ అంచనాలను మించి రాణిస్తోంది - ప్రపంచ పరిస్థితుల్లో అనిశ్చితి నెలకొన్నా, భారత్ స్థిరంగా అభివృద్ధి వైపు ముందడుగు ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్ - త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది మేడిన్ ఇండియా ఉత్పత్తులను వినియోగిస్తున్నాం - ప్రపంచదేశాలన్నీ చెప్పుకొనే రోజు త్వరలోనే రానుంది సుంకాలపై మోదీ కీలక వ్యాఖ్యలు....

# వైఎస్సార్ స్ఫూర్తిని కొనసాగిస్తాం




## రైతులకు ఉచిత విద్యుత్‌తో చెరగని ముద్ర వేశారు

- బకాయిలు రద్దు చేయడంతో పాటు వారిపై కేసులు కొట్టివేయించారు
- ఉచిత విద్యుత్ ఎవరు ఇచ్చినా ఆయన పేరే గుర్తుకు తెచ్చుకుంటారు
- భవిష్యత్తులోనూ ఎవరూ రద్దు చేయలేని పథకాలను వైఎస్సార్ అమలు చేశారు
- ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను రద్దు చేసే ధైర్యం ఎవరికీ లేదు
- రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.2లక్షలు ఉంటే రూ.10లక్షలు చేశాం
- అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే రైతుల రుణమాఫీ అమలు చేశాం
- కేంద్ర ప్రభుత్వం సహకారం లేకపోవడంతో రాష్ట్రంలోని రైతులకు యూరియా సమస్య
- ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తా.. నల్గొండ ప్రజల రుణం తీర్చుకుంటాం
- ఈదేశానికి రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలని వైఎస్సార్ అనే వారు
- ఆయన కోరిక తీర్చే బాధ్యతను నేను, షర్మిల, కేవీపీ సహా మేమంతా తీసుకుంటాం
- వైఎస్సార్ మెమోరియల్ అవార్డ్స్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి
- సుభాష్ పాలేకర్‌కు వైఎస్సార్ మెమోరియల్ అవార్డును ప్రదానం

2లో...

# ఛలో హైదరాబాద్ వాయిదా



- ఉద్యోగ సంఘాల జేఏసీతో భట్టి, శ్రీధర్‌బాబు చర్చలు..
- ఈనెల 8న విధివిధానాలు ఖరారు చేస్తాం
- త్వరలో హెల్త్ కార్డులు మంజూరు చేస్తామన్న కేబినెట్ సబ్ కమిటీ

**విశ్వంభర,హైదరాబాద్:** సచివాలయంలో ఉద్యోగ సంఘాల జేఏసీతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు చర్చించారు. ఈనెల 8న విధివిధానాలు ఖరారు చేసి, త్వరలో హెల్త్ కార్డులు మంజూరు చేస్తామని కేబినెట్ సబ్ కమిటీ హామీ ఇచ్చింది. టీచర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి వర్గ ఉప సంఘం తెలిపింది. పెండింగ్ బిల్లుల విడుదల, నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటుకు హామీ లభించింది. విజిలెన్స్, ఏసీబీ కేసులతో రెండేళ్లకు పైగా సస్పెన్షన్‌లో ఉన్న ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కేబినెట్ సబ్ కమిటీ అంగీకారం తెలిపింది.
ఈ నేపథ్యంలో ఈనెల 8 నుంచి 19 వరకు చేపట్టనున్న జిల్లా బస్సు యాత్ర, 12న ఛలో హైదరాబాద్ వాయిదా వేస్తున్నట్టు ఉద్యోగ సంఘాల ఐకాస తెలిపింది.



### బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ
## కవిత సస్పెన్షన్

ప్రధాన కార్యదర్శులు సోమ భరత్‌కుమార్, టి.రవీందర్‌రావు పేరిట ప్రకటన విడుదల పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను తీవ్రంగా పరిగణిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి

2లో...

## దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడిన విదేశీయులకు భారత్‌లోకి నో ఎంట్రీ



- అడ్డుకునేందుకు చర్యలు చేపట్టాలి
- ఇమ్మిగ్రేషన్ ఫారినర్స్ చట్టం ప్రకారం వారిని గుర్తించాలి
- వారిని అదుపులోకి తీసుకునేందుకు వీలుగా ప్రత్యేక నిర్బంధ శిబిరాలను ఏర్పాటు చేయాలి
- కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ

2లో...

## ఎన్‌డీఎస్ఏ నివేదిక ఆధారంగా విచారణ చేయండి

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు ఉన్నట్లు గుర్తించింది
ప్రణాళిక, డిజైన్, నాణ్యత, నిర్మాణంలో లోపాలు ఉన్నాయి
సీబీఐకి తెలంగాణ ప్రభుత్వం సిఫారసు
సీబీఐ రాకుండా గతంలో ఉన్న ఆదేశాలను సడలిస్తూ జీవో విడుదల
జస్టిస్ ఘోష్ నివేదికను రద్దు చేయండి..
హైకోర్టులో విశ్రాంత సీఎస్ పిటిషన్




2లో...

## ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు ఉండేలా చూస్తాం

- ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్ 1అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- దక్షిణాదిలో ఏపీ నెంబర్‌వన్ రాష్ట్రంగా మారుతుంది
- భవిష్యత్తులో రోడ్లు, రైలు, సముద్రం, ఎయిర్ లాజిస్టిక్స్ పెరుగుతాయి
- రోడ్ల అనుసంధానం జరిగినట్లు నదులను కూడా కలపాలి
- గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి పెరిగేలా అనేక చర్యలు చేపట్టాం - ఏపీ సీఎం చంద్రబాబు

2లో...

## జూబ్లీహిల్స్ ఓటర్ల సంఖ్య 3.92లక్షలు!




- ప్రకటించిన ఎన్నికల సంఘం
- ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులకు అవకాశం
- ఈనెల 17 వరకు దరఖాస్తులు ఇవ్వాలి
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డి...

2లో...



2లో...

## సుదర్శన్ రెడ్డిని అర్బన్ నక్సలైట్ అనడం తగదు..

దేశంలో పౌరుల హక్కులు బలహీనమవుతున్నాయి ఈ సమయంలో, ఈ ఎన్నిక దేశ ముఖచిత్రానికి దిక్సూచిగా నిలవాలి - ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉ పరాష్ట్రపతి ఎన్నికలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిని గెలిపించాలి ప్రొఫెసర్ కోదండరామ్

# వైఎస్సార్ స్ఫూర్తిని కొనసాగిస్తాం

## వైఎస్సార్ మెమోరియల్ అవార్డ్స్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి





మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, హైదరాబాద్:** రైతులకు ఉచితవిద్యుత్‌పై మాజీ సీఎం వైఎస్సార్ చెరగని ముద్ర వేశారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హోటల్ దస్‌పల్లాలో నిర్వహించిన వైఎస్సార్ మెమోరియల్ అవార్డ్స్ కార్యక్రమంలో సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సుభాష్ పాలేకర్‌కు వైఎస్సార్ మెమోరియల్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రైతుల విద్యుత్ బకాయిలు రద్దు చేయడంతో పాటు, వారిపై కేసులు కొట్టివేసి వైఎస్సార్ గొప్ప నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. ఉచిత విద్యుత్ ఎవరు ఇచ్చినా ఆయన పేరే గుర్తుకు తెచ్చుకుంటారని చెప్పారు. "భవిష్యత్తులోనూ ఎవరూ రద్దు చేయలేని పథకాలను వైఎస్సార్ అమలు చేశారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను రద్దు చేసే ధైర్యం ఎవరికీ లేదు. ఆయన స్ఫూర్తిని ఈ ప్రభుత్వం కొనసాగిస్తోంది. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.2లక్షలు ఉంటే రూ.10లక్షలు చేశాం. అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే రైతుల రుణమాఫీ అమలు చేశాం. కేంద్ర ప్రభుత్వం సహకారం లేకపోవడంతో రాష్ట్రంలోని రైతులకు యూరియా సమస్య వచ్చింది. సుభాష్ పాలేకర్ చెప్పినట్లు సేంద్రియ వ్యవసాయం చేస్తే ఉపయోకరంగా ఉంటుంది.

ఆ దిశగా రసాయన వ్యవసాయం నుంచి సేంద్రీయ వ్యవసాయం వైపు అడుగులు వేయాలి. గోదావరి జలాలు చేవెళ్ల నుంచి ప్రాణహిత వరకు తరలించాలని వైఎస్సార్ ఆలోచన చేశారు. గోదావరిపై తుమ్మిడిహెట్టి ప్రాజెక్ట్ మేమే కడతాం. ఫ్లోరైడ్ వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. వాటిని అధిగమించడానికి రూ.2వేల కోట్లతో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును చేపట్టారు. అది పూర్తయితే నల్గొండ జిల్లాలో 3.60లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు వచ్చేది. ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసి నల్గొండ ప్రజల రుణం తీర్చుకుంటాం. ఈదేశానికి రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలని వైఎస్సార్ అనే వారు. ఆయన కోరిక తీర్చే బాధ్యతను నేను, షర్మిల, కేవీపీ సహా మేమంతా తీసుకుంటాం. ప్రజల సహకారం కూడా కావాలి"అని రేవంత్‌రెడ్డి అన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,మంత్రి శ్రీధర్‌బాబు, కేవీపీ రామచందర్‌రావు తదితరులు హాజరయ్యారు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సభికుల మధ్యలోనే కూర్చొని కార్యక్రమాన్ని వీక్షించారు.

# బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్



మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర,హైదరాబాద్:** భారత రాష్ట్ర సమితి సంచలన నిర్ణయం తీసుకుంది. పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను తీవ్రంగా పరిగణిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు భారత రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శులు సోమ భరత్‌కుమార్, టి.రవీందర్‌రావు పేరిట ఓ ప్రకటన విడుదల చేసింది. "ఇటీవల కాలంలో కవిత ప్రవర్తిస్తున్న తీరు, కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు భారత రాష్ట్ర సమితికి నష్టం కలిగించేలా ఉన్నాయి. అధిష్ఠానం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు" అని భారత రాష్ట్ర సమితి పేర్కొంది.

కవిత ప్రస్తుతం నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీగా ఉన్నారు. కొంతకాలంగా భారత రాష్ట్ర సమితితో విభేదిస్తున్న కవిత.. ఎక్కువగా తెలంగాణ జాగృతి తరఫున నిర్వహించే కార్యక్రమాలకే పరిమితమయ్యారు. కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయని.. తనపై కొందరు కుట్రలకు పాల్పడుతున్నారని ఇటీవల ఆరోపించారు.

గతంలో పరోక్ష విమర్శలు చేసిన కవిత..సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. కేసీఆర్‌పై సీబీఐ విచారణ వరకు పరిస్థితి వచ్చాక.. పార్టీ ఉంటే ఎంత? లేకపోతే ఎంత? అని కవిత వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో పార్టీ విధానంతో ఆమె విభేదించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కవితను పార్టీ సస్పెండ్ చేసింది.

## ఎన్‌డీఎస్ఏ నివేదిక ఆధారంగా

# విచారణ చేయండి

### - హైకోర్టులో విశ్రాంత సీఎస్ పిటిషన్

మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, హైదరాబాద్:** కాళేశ్వరంపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) నివేదిక ఆధారంగా సీబీఐ విచారణకు తెలంగాణ ప్రభుత్వం సిఫారసు చేసింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు ఉన్నట్లు ఎన్‌డీఎస్ఏ గుర్తించిందని.. ప్రణాళిక, డిజైన్, నాణ్యత, నిర్మాణంలో లోపాలు ఉన్నాయని ప్రభుత్వం పేర్కొంది.

అందుకే ఈ అంశంపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ కూడా విచారణ జరిపి లోపాలను గుర్తించిందని తెలిపింది. ఎన్‌డీఎస్ఏ నివేదికపై అసెంబ్లీలో చర్చించామని లేఖలో ప్రభుత్వం ప్రస్తావించింది. మరోవైపు రాష్ట్రానికి సీబీఐ రాకుండా గతంలో ఉన్న ఆదేశాలను సడలిస్తూ జీవో విడుదల చేసింది. సీబీఐ విచారణకు అన్నివిధాలుగా సహకరిస్తామని ప్రభుత్వం పేర్కొంది.

**జస్టిస్ ఘోష్ నివేదికను రద్దు చేయండి..**

కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది.

విశ్రాంత సీఎస్ ఎస్‌కే జోషి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. సాక్షిగా మాత్రమే తనకు నోటీసులు ఇచ్చారని జోషి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తనకు ఎలాంటి లీగల్ నోటీసులు ఇవ్వలేదని, తనపై చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. జోషి పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు బుధవారం విచారణ చేపట్టనుంది.

# ఎన్ని సవాళ్లెదురైనా..7.8 శాతం వృద్ధి రేటు..



మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** అమెరికా విధిస్తున్న సుంకాలను ఉద్దేశిస్తూ.. ప్రధాని నరేంద్ర మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇతరుల ఆర్థికస్వార్థం వల్ల ఎన్ని సవాళ్లు ఎదురైనప్పటికీ భారత్ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని.. దేశ ఆర్థిక వ్యవస్థ అంచనాలను మించి రాణిస్తోందన్నారు. ఢిల్లీలోని బశోభూమిలో నిర్వహించిన సెమీకాన్ ఇండియా 2025 సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ పరిస్థితుల్లో అనిశ్చితి నెలకొన్నప్పటికీ భారత్ మాత్రం స్థిరంగా అభివృద్ధి వైపు ముందడుగు వేస్తోందన్నారు. ప్రపంచంలోని వివిధ కంపెనీలు మేకిన్ ఇండియా కోసం భారత్‌కు రావాలని.. ప్రపంచం కోసం తయారీలు చేపట్టాలని పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వ పాలనలో భారత్‌లో రాజకీయ స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం, విధానాల్లో పారదర్శకత వంటి పలు మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్.. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని విశ్వాసం వ్యక్తంచేశారు. ఈ వృద్ధి కేవలం ఒకే రంగానికి పరిమితం కాకుండా అన్నిరంగాల్లో కనిపిస్తోందని మోదీ అన్నారు. తాము మేడిన్ ఇండియా ఉత్పత్తులను వినియోగిస్తున్నట్లు ప్రపంచదేశాలన్నీ చెప్పుకొనే రోజు త్వరలోనే రానుందని పేర్కొన్నారు. సెమీకాన్ ఇండియా 2025 సదస్సులో 40 దేశాల ప్రతినిధులు పాల్గొనడంపై సంతోషం వ్యక్తంచేశారు. ప్రపంచ దేశాలకు భారత్‌పై నమ్మకం పెరిగిందనడానికి ఇదే ఉదాహరణ అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పోటీ పెరిగిన తరుణంలోనూ భారత్‌కు ఆదరణ తగ్గలేదన్నారు. భారత్‌పై అమెరికా భారీగా పన్నులు విధిస్తున్న నేపథ్యంలో మోదీ మాటలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**తొలి "మేకిన్-ఇండియా" చిప్‌లను ప్రధానికి ఇచ్చిన అశ్వినీ వైష్ణవ్..**

ప్రతి పరికరంలో ఇండియన్ మేడ్ చిప్ ఉండాలనేది తమ కల అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. సెమీకాన్ ఇండియా 2025 సదస్సులో తొలి "మేకిన్-ఇండియా" మైక్రో ప్రాసెసర్ చిప్‌లను ప్రధాని మోదీకి ఆయన అందించారు. భారత్ తయారుచేసిన విక్రమ్ 32-బిట్ ప్రాసెసర్‌తోపాటు 4 టెస్ట్ చిప్స్‌ను అందించారు. ఈ తొలి మైక్రో ప్రాసెసర్ చిప్‌ను ఇస్రో సెమీ కండక్టర్ ల్యాబ్ అభివృద్ధి చేసిందన్నారు. వాహక నౌకల్లో కఠిన వాతావరణ పరిస్థితుల్లోనూ పనిచేసేలా దీనిని రూపొందించినట్లు తెలిపారు. సెమీ కండక్టర్ ఎకోసిస్టమ్ పెంపొందించడమే లక్ష్యంగా కేంద్రం చర్యలు తీసుకుంటుందన్నారు. కొన్నేళ్ల క్రితం ప్రధాని దూరదృష్టితో ఆలోచించి.. దీనిని ప్రారంభించినట్లు తెలిపారు. దీంతో కేవలం 3.5 సంవత్సరాల వ్యవధిలో ప్రపంచదేశాలు భారతదేశం వైపు నమ్మకంగా చూస్తున్నాయన్నారు. ప్రస్తుతం దేశంలో ఐదు సెమీకండక్టర్ యూనిట్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని అన్నారు. ఇటీవల జపాన్ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ భారత్-జపాన్ సంయుక్త ఆర్థిక సదస్సులో ప్రసంగించారు.

సెమీకండక్టర్ల పరిశ్రమల నుంచి స్టార్టప్‌ల వరకూ జపాన్ భారత్‌కు అత్యంత కీలక భాగస్వామిగా ఉందని ప్రధాని పేర్కొన్నారు. జపాన్ సంస్థలు భారత్‌లో 40 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు. జపాన్ ప్రధాని ఇషిబాతో ఏఐ, సెమీ కండక్టర్లు, బుల్లెట్ రైలు, పెట్టుబ డులే అజెండాగా ద్వైపాక్షిక చర్చలు జరిపారు.


# దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడిన విదేశీయులకు భారత్‌లోకి నో ఎంట్రీ



మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర,నేషనల్ బ్యూరో:** దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడిన విదేశీయులు భారత్‌లోకి రాకుండా అడ్డుకునేందుకు చర్యలు చేపట్టాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. గతంలో భారత్‌కు వచ్చి.. గూఢచర్యం, అత్యాచారం, హత్య, ఉగ్రవాద చర్యలు, నిషేధిత సంస్థలలో సభ్యులుగా ఉండటం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి ఆరోపణలపై దోషులుగా తేలి.. వారి దేశాలకు వెళ్లిపోయిన విదేశీయులపై ఈ చర్యలు తీసుకోవాలని సూచించింది. అటువంటి వారు తిరిగి భారత్‌లోకి ప్రవేశించకుండారాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు చర్యలు చేపట్టాలని కేంద్ర హోంశాఖ ఆదేశించింది. అలాంటి వారిని గుర్తిస్తే వారిని నిర్బంధించాలని పేర్కొంది. ఇటీవల ప్రవేశపెట్టిన ఇమ్మిగ్రేషన్ ఫారినర్స్ చట్టం (2025) ప్రకారం దేశవ్యతిరేక చర్యలకు పాల్పడిన విదేశీయులను గుర్తించి.. వారిని అదుపులోకి తీసుకునేందుకు వీలుగా ప్రత్యేక హోల్డింగ్ సెంటర్లు లేదా నిర్బంధ శిబిరాలను ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ విషయంలో సరిహద్దు రక్షణ దళాలు,కోస్ట్ గార్డులుకూడా బాధ్యత తీసుకోవాలని హోంమంత్రిత్వ శాఖ ఆదేశించింది. సరిహద్దుల వద్ద భారత్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించే అక్రమ వలసదారులను నిరోధించడానికి చర్యలు తీసుకోవాలని పేర్కొంది. అంతే కాకుండా భారత్‌లో ఉద్యోగం చేయడానికి చెల్లుబాటు అయ్యే వీసా ఉన్న విదేశీయులు ఇక్కడి పౌర అధికారుల అనుమతి లేకుండా విద్యుత్, నీరు, పెట్రోలియం వంటి వాటికి సంబంధించిన ప్రైవేటు ఉద్యోగాల్లో చేరకూడదని షరతు పెట్టింది. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా పర్వతారోహణ యాత్రలు సైతం చేపట్టొద్దని సూచించింది. అఫ్గానిస్థాన్, చైనా, పాకిస్థాన్‌లలో జన్మించిన విదేశీయులకు భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్, మణిపుర్, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం, ఉత్తరాఖండ్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, జమ్మూ కశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాల్లో ప్రవేశం నిషిద్ధమని తెలిపింది. అవి సున్నితమైన సరిహద్దు ప్రాంతాలు కాబట్టి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది.

# ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు ఉండేలా చూస్తాం : ఏపీ సీఎం చంద్రబాబు



మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, విశాఖపట్నం:** ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గ్లోబల్ ఫోరం ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో విశాఖ నోవాటెల్‌లో ఏర్పాటు చేసిన ఈస్ట్ కోస్ట్ మారీటైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్‌లో సీఎం పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర - 2047 లక్ష్యాలలో భాగంగా ఏపీని గ్లోబల్ లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దే అంశంపై చంద్రబాబు పారిశ్రామిక ప్రతినిధులతో చర్చించారు."దక్షిణాదిలో ఏపీ నెంబర్‌వన్ రాష్ట్రంగా మారుతుంది. భవిష్యత్తులో రోడ్లు, రైలు, సముద్రం, ఎయిర్ లాజిస్టిక్స్ పెరుగుతాయి. రోడ్ల అనుసంధానం జరిగినట్లు నదులను కూడా కలపాలి. ఇవాళ ఇళ్లపైనే విద్యుదుత్పత్తి చేసుకుంటున్నాం. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి పెరిగేలా అనేక చర్యలు చేపట్టాం. ఏఐ, క్వాంటమ్ వ్యాలీ పరిధి రోజు రోజుకూ పెరుగుతోంది. డ్రోన్లు, రోబోటిక్స్, ఐవోటీ, సెన్సార్స్‌ను వాడుకుంటున్నాం. ప్రతిరంగంలోనూ స్పష్టమైన సమాచారం ఉంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించాం. వన్ ఫ్యామిలీ.. వన్ ఆంట్రపెన్యూర్.. అనేది నా లక్ష్యం.

నీటి భద్రత విషయంలో అనేక సమస్యలు ఉన్నాయి. దేశంలో నదుల అనుసంధానం చేపట్టాలని ఎప్పటినుంచో కోరుతున్నా. గంగా నుంచి కావేరీ వరకు నదులను అనుసంధానం చేయాలి.ఏపీకి 1,053 కి.మీ తీరప్రాంతం ఉంది. ఇది మనకు పెద్ద ఆస్తి. ప్రస్తుతం బల్క్ రూపంలోనే 90శాతం కార్గో రవాణా చేస్తున్నాం. ఎయిర్ కార్గో ద్వారా వేగంగా సరకులు పంపిణీ చేయవచ్చు. రైలు కనెక్టవిటీలో ఏపీ చాలా అనుకూలంగా ఉంది. లాజిస్టిక్స్ విషయంలో ఈస్ట్‌కోస్ట్‌లో మనదే అగ్రస్థానం కావాలి. ఇప్పటికే మనకు 6 పోర్టులున్నాయి.. మరికొన్ని పోర్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. 2046నాటికి పోర్టులన్నీ పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రతి 50 కి.మీ దూరానికి ఒక పోర్టు ఉం డేలా చూస్తాం. ఫార్మా, ఆక్వా ఉత్పత్తుల ఎగుమతిలో ఏపీదే అగ్రస్థా నం. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిలోనూ మంచి వృద్ధి సాధిస్తున్నాం. మన పోర్టుల అభివృద్ధికి సహజసిద్ధ వనరులు ఉన్నాయి.

షిప్‌బిల్డింగ్ విషయంలో మనదేశం చాలా వెనుకబడి ఉంది" అని సీఎం చంద్రబాబు అన్నారు. ఎయిర్‌కార్గో వసతులు అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా లాజిస్టిక్ సంస్థల ప్రతినిధులు కోరారు. ఈ సమ్మిట్‌లోనే ఎయిర్‌కార్గో ఫోరమ్ ఇండియా లోగోను సీఎం ఆవిష్కరించారు. దాదాపు 20 కంపెనీల సీఈవోలు సదస్సులో పాల్గొన్నారు.

# సుదర్శన్ రెడ్డిని అర్బన్ నక్సలైట్ అనడం తగదు..: ప్రొఫెసర్ కోదండరామ్

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిని గెలిపించాలని ప్రొఫెసర్ కోదండరామ్ పిలుపునిచ్చారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతుగా విద్యావంతులు, మేధావులు, జర్నలిస్టులు, ప్రముఖ సామాజిక కార్యకర్తల నుంచి సేకరించిన సంతకాల పత్రాన్ని ప్రముఖ జర్నలిస్టులు రామచంద్రమూర్తి, మల్లెపల్లి లక్ష్మయ్య, ప్రొఫెసర్ కోదండరామ్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా టీజేఎస్ చీఫ్, ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక ఎన్నిక మాత్రమే కాదు.. భారతదేశ భావప్రకటన స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య సంస్థల నిలకడపై జరుగుతున్న ఎన్నిక అని అన్నారు. దేశంలో పౌరుల హక్కులు బలహీనమవుతున్న ఈ సమయంలో, ఈ ఎన్నిక దేశ ముఖచిత్రానికి దిక్సూచిగా నిలవాలని అన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడే శక్తులు ఒకవైపు, రాజ్యాంగ వ్యతిరేక శక్తులు ఒకవైపు ఉన్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉపరాష్ట్రపతి ఎన్నికలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు విద్యావంతులు, మేధావులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు తదితరులు 155 మంది సంతకాలు చేసినట్లు తెలిపారు. ఈ సంఖ్య త్వరలో మరింత పెరుగుతుందన్నారు. కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ " అర్బన్ నక్సలైట్ అంటే ఏంటో నాకు ఇప్పటికీ అర్థం కాలేదు. అర్బన్ ఏరియా లో పని చేసినంత మాత్రాన ముద్ర వేయడం ఏంటీ? సుదర్శన్ రెడ్డిని అర్బన్ నక్సలైట్ అని పిలవడం తగదు. ఆపదానికిఅర్థం లేదు. అర్బన్ ప్రాంతాల్లో ప్రజాస్వామ్యం కోసం పని చేసే వారిని నక్సలైట్లు అనడం దురదృష్టకరం. ప్రజాస్వామ్యాన్ని కోరుకోవడం తప్పయితే అంతకన్నా ప్రమాదకరమైనది ఇంకేమీ ఉండదు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కులు తెలియని వారే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారు" అని తీవ్రంగా ఫైర్ అయ్యారు.

# జూబ్లీహిల్స్ ఓటర్ల సంఖ్య 3.92లక్షలు!

మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, హైదరాబాద్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో త్వరలో ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆ నియోజకవర్గంలో ఓటర్ల వివరాలను ఎన్నికల సంఘం ప్రకటించింది. జూబ్లీహిల్స్ పరిధిలో 3,92,669 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొంది. వీరిలో 2,04,288 మంది పురుషులు కాగా, 1,88,356 మంది మహిళలు, 25 మంది ఇతరులు ఉన్నట్లు తెలిపింది. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు ఉంటే ఈ నెల 17 వరకు దరఖాస్తులు ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

కొత్తగా ఓటు నమోదు, చిరునామా మార్పుల కోసం కూడా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 29 వరకు అభ్యంతరాలు, దరఖాస్తులను పరిశీలించి 30న ఓటర్ల తుది జాబితా ప్రకటిస్తామని వెల్లడించారు. నియోజకవర్గంలో 139 భవనాల్లో 407 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులకు మరొక అవకాశం

విశ్వంభర, హైదరాబాద్‌: డా. బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చేయాలనుకునే విద్యార్థి విద్యార్థినులకు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరుటకు సెప్టెంబర్ 12 తేది వరకు పొడగించడం జరిగిందని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. శ్రీనివాసరాజు మరియు కోఆర్డినేటర్ డా. రాజారామ్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్టడీ సెంటర్ కలదు ఆర్థిక స్తోమత లేక, చదువ మధ్యలో ఆపేసిన వారు, వితంతువులు, ఇతర కారణాల వలన చదువు మధ్యలో ఆపేసిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, అలాగే ప్రస్తుతం ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినిలు ట్యూషన్ ఫీజును చెల్లించడానికి కూడా సెప్టెంబర్ 12వ తేదీ చివరి తేదీ అని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్లైన్లో సెప్టెంబర్ 12 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8919436579, 7382929758 సంప్రదించగలరు.



# విద్యార్థులు జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం

**- ఫీజులను విడుదల చేయకుండా ఇబ్బందులు - విద్యార్థుల గోస రేవంత్ రెడ్డికి వినిపించడం లేదా ?- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో "మంత్రుల నివాసాలముట్టడి"- పోలీసులు విద్యార్థులకు మధ్య తీవ్ర తోపులాట,- విద్యార్థి నాయకులు అరెస్టు, పలువురికి గాయాలు**





విశ్వంభర, హైదరాబాద్:రాష్ట్రంలో గత ఆరేళ్ల నుండి పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రీయంబర్స్ విడుదల చేయాలని, విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ నేడు జిల్లా కలెక్టరేట్స్ మరియు జిల్లా కేంద్రాల్లో భారీ ప్రదర్శనలకు పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా హైదరాబాద్ లోని "మంత్రుల నివాసాల ముట్టడి" కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ చేసింది. ఈ సందర్భంగా తమ సమస్యలు మంత్రులకు చెప్పెందుకు వెళ్తున్న విద్యార్థి నేతలను పోలీసులు అడ్డుకోని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా తీవ్ర తోపులాట విద్యార్థులకు, పోలీసులకు మద్య జరిగింది. ఈ తోపులాటలో విద్యార్థి నాయకులు తీవ్రంగా గాయపడ్డారు,పలువురు చోక్కాలను చింపి పోలీసులు విద్యార్థి నాయకులపై దాడి చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రజనీకాంత్ మాట్లాడారు. రాష్ట్రంలో గత ఆరేళ్ల నుండి సుమారు 8,158 కోట్లు పెండింగ్ ఫీజులు బకాయిలు ఉన్నాయి. వాటిని ప్రభుత్వం విడుదల చేయడం లేదు. ఫీజులను విడుదల చేయకపోవడం వల్లన విద్యార్థులు సర్టిఫికేట్స్ యాజమాన్యాలు ఇవ్వడం లేదని ,దీనివల్ల పై చదువులకు వెళ్ళలేక పోతున్నారని అన్నారు. రాష్ట్రంలో గత 9 నెలలుగా గురుకులాలు, కెజిబివిలు, ఆశ్రమ పాఠశాలలు మెస్,కాస్మోటిక్ ఛార్జీలు పెండింగ్ ఉన్నాయి. వాటిని విడుదల చేయడం లేదన్నారు.కెజిబివిలు, ఎస్సీ గురుకులాలలో యూనిఫామ్, టెక్ట్స్ బుక్స్ పూర్తిస్థాయిలో అందించలేదని పుస్తకాలు లేకుండా పాఠాలు ఎలా చదువు కుంటారని ప్రశ్నించారు.రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి గత 20నెలలుగా లేరని, విద్యార్థులు చనిపోయిన, సమస్యలు వచ్చిన కనీసం విద్యారంగాన్ని పట్టించుకోకునే నాథుడే లేదని అన్నారు.బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలు, యూనివర్శిటీల నిధులు బకాయిలు, పాఠశాల అభివృద్ధి కోసం మన ఊరు మనబడి బకాయిలు ఇలా సమస్తం బకాయిలు విద్యలో ఉన్నాయని తెలిపారు.తక్షణ చర్యలు తీసుకుని ప్రభుత్వం యాజామన్యాలు విద్యార్థులు దగ్గర నుండి ఫీజులను వసూళ్లు చేయకుండా నిర్ణయం తీసుకోవాలని, ప్రత్యేక జీ.వో. తీసుకుని రావాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులపై పోలీసులు కర్కశంగా వ్యవరించి చోక్కాలను చింపివేశారు. అనంతరం బొల్లారం, కార్కనా, బోయినపల్లి, తిరుమల గిరి పోలీసు స్టేషన్లుకు అరెస్ట్ చేసి తరలించారు. ఈ ముట్టడి కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యాక్షులు డి.కిరణ్, కె.అశోక్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు, కార్తీక్, కె.వై. ప్రణయ్, లెనిన్ గువేరా,అవినాష్, జె.రమేష్,మరియు హైదరాబాద్ జిల్లా నాయకులు శ్రీమాన్, స్టాలిన్, భగత్ మేడ్చల్ జిల్లా నాయకులు రంగారెడ్డి జిల్లా నాయకులు శ్రీకాంత్,తరంగ్, అరుణ్, శివ,లిఖిత్ తదితరులు పాల్గొన్నారు.

**- అక్రమంగా అరెస్ట్ చేయడం హేయమైన చర్య: ఎస్.ఎఫ్.ఐ. రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు**

రాష్ట్రంలో ఫీజుల బకాయిలు విడుదల చేయాలని ఆందోళన చేస్తున్న విద్యార్థులు పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కర్కశంగా వ్యవరించి, దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రజాస్వామ్య వాదులు, మేథావులు, విద్యార్థులు ఖండించాలని ఎస్.ఎఫ్.ఐ. రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు తెలిపారు. హైదరాబాద్ మంత్రులు నివాసాల ముట్టడి సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్, అశోక్, రాష్ట్ర నాయకులు కార్తీక్ ,ప్రణయ్, లెనిన్,అవినాష్, శ్రీకాంత్ తదితరులు అరెస్ట్ చేశారు.అశోక్ రెడ్డి చోక్కాలను చించేశారు. శ్రీకాంత్ కాలికి రక్తం వచ్చేలాగా గాయాలు చేశారు. విద్యార్థులను రౌడిలాగా ఈడ్చుకుంటూ వెళ్ళి పోలీసు వ్యాన్లలో వేశారు. హన్మకొండ, సిరిసిల్ల జిల్లాలో అక్రమంగా అరెస్టు చేశారు. కనీసం సమస్యలు చెప్పుకోకుండాపోలీసులు నిర్బంధం ప్రయోగిస్తున్నారు. ప్రజాస్వామ్యం లేకుండా చేస్తున్నారు. ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజాపాల నలో ప్రజాస్వామ్యం ఏక్కడుందని, విద్యార్థులు గోస వినేవారు లేరని దుయ్య బట్టారు.ఫీజులను విడుదల చేసి, విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయా లని లేకుంటే భవిష్యత్ పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## పోలయ్య కవి కూకట్లపల్లికి ఘన సన్మానం




విశ్వంభర, హైదరాబాద్‌: హైదరాబాద్ పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం మహాకవి శ్రీ దాశరధి కృష్ణమాచార్య "శతజయంతి" ఉత్సవాల సందర్భంగా "లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అపూర్వ" ,సర్వేజనా సుఖినోభవంతు...ఆధ్వర్యంలో మందాటి కృష్ణారెడ్డి అధ్యక్షతన శతాధిక కవుల ఘన సన్మాన మహోత్సవ సభ అపూర్వంగా జరిగింది. ఈ సభలో దాదాపుగా 4000 కవితలు వ్రాసిన హైదరాబాద్ అత్తాపూర్ నివాసి ప్రముఖ కవి రచయిత పోలయ్య కవి కూకట్లపల్లిని వారు చేస్తున్న గొప్ప సాహితీ సేవకు గుర్తింపుగా...ముఖ్య అతిథి లయన్ డా.జి.మహేంద్ర కుమార్ రెడ్డి డిస్ట్రిక్ట్ గవర్నర్ 320-ఏ లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అపూర్వ ప్రెసిడెంట్ లయన్ డా.ఇవిస్ సూర్య నారాయణ...వారిమిత్ర బృందం కలిసి పోలయ్య కవి కూకట్లపల్లిని పూలమాలతో..శాలువాతో.. అందమైన జ్ఞాపికతో ఎంతో ఘనంగా సత్కరించారు. తదనంతరం సన్మాన గ్రహీత పోలయ్య కవి కూకట్లపల్లి మాట్లాడుతూ...తాను సామాజిక అంశాలు, మానవతా సంబంధాలే, ఇతివృత్తాలుగా దాదాపుగా 4000 కవితలు వ్రాసినందుకు...వ్రాసిన కవితలన్నీ 70 దిన, వార, మాస డిజిటల్ పత్రికల్లో ప్రచురితమైనందుకు కులమత రహిత నవసమాజం నిర్మాణం కోసం..యువతలో చైతన్యజ్వాలల్ని రగిలించడం కోసం... తనవంతుగా సాహితీపరమైన కృషిని చేస్తున్నందుకు...ఒక గుర్తింపుగా ఈ సాహితీ సత్కారం జరిగిందని, ఇది తన అదృష్టమని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ ఘన సన్మానంతో సాహితీ రంగంలో తన బాధ్యత పెరిగిందని.. తనను సన్మానించిన లయన్ డా. సూర్య నారాయణకు.. డిస్ట్రిక్ట్ గవర్నర్‌కు వారి లయన్స్ క్లబ్ బృందానికి పేరు పేరున కూకట్లపల్లి పోలయ్య కృతజ్ఞతలు తెలియజేశారు.

## పేదవారి సొంతింటి కల నెరవేరనుంది

### పండుగ వాతావరణంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



విశ్వంభర, హైదరాబాద్‌: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండలపాడు గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పేదవారి సొంతింటి కల నెరవేరబోతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార,పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళ వారం బెడాలపాడు గ్రామంలో జరగబోయే ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల ఏర్పాట్లను గృహనిర్మాణ శాఖ ఎండి వి. పి. గౌతమ్, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్యతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మారుమూల గిరిజన ప్రాంతమైన బెండలపాడు గ్రామానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రావడం ఒక చారిత్రక ఘట్టం. ఇది గ్రామ ప్రజలకు సంతోషకరమైన మరియు గుర్తుండిపోయే రోజు అవుతుంది. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావడానికి జిల్లా యంత్రాంగంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలి అని సూచించారు. మంత్రి అధికారులు గృహప్రవేశ వేడుకలను పండుగ వాతావరణంలో, అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. సభా ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం, గ్రామాన్ని అందంగా తీర్చిదిద్దడంలో ఎలాంటి లోటు లేకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై మాట్లాడుతూ మంత్రి తెలిపారు, మా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి గృహనిర్మాణ శాఖను బలోపేతం చేస్తూ, పేదవారికి న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో ఇళ్లను మంజూరు చేస్తున్నాం. లబ్ధిదారుల ఎంపిక నుండి వారి ఖాతాల్లో నిధుల జమ వరకు మొత్తం ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఎక్కడైనా అవకతవకలు జరిగినా వాటిని వెంటనే గుర్తించి, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటివరకు కొందరిని సస్పెండ్ చేయడం, కేసులను ఏసీబీకి అప్పగించడం కూడా జరిగింది అని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వానికి ఓటు వేసిన వారికే కాకుండా, రాజకీయాలు, కులం, మతం అనే తేడా లేకుండా ప్రతి పేదవానికి సొంతింటి కల నెరవేరేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ పథకం వల్ల జిల్లాలోనే సుమారు 21,500 కుటుంబాల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి గారు గృహప్రవేశాల సందర్భంగా లబ్ధిదారులను ప్రత్యక్షంగా ఉద్దేశించి మాట్లాడి, వారి సంతోషంలో పాలుపంచుకుంటారు అని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వం గృహనిర్మాణ శాఖను నిర్వీర్యం చేసి, పేదవారి కలలను దెబ్బతీసింది. కానీ మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గృహనిర్మాణ శాఖను తిరిగి బలోపేతం చేసి, లక్షలాది పేదలకు గృహాల కలను నిజం చేసేందుకు కృషి చేస్తున్నాం" అన్నారు. ఈ మహత్తర గృహప్రవేశ కార్యక్రమానికి జిల్లా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, ఇంచార్జ్ మంత్రి వాకాటి శ్రీహరి, ఇతర సహచర మంత్రులు, శాసనసభ్యులు పాల్గొంటారని మంత్రి తెలిపారు. ఈ పరిశీలనలో టీజీ ఐడిసి చైర్మన్ మువ్వ విజయ్ బాబు,ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, కొత్తగూడెం ఆర్డీవో మధు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల రిజర్వేషన్లను తొలగించేందుకు కాంగ్రెస్ కుట్ర



విశ్వంభర, హైదరాబాద్‌: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కాంగ్రెస్ మాజీ ఎంపీ సోయం బాబురావు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్లు సుప్రీంకోర్టులో వేసిన కేసుతో కాంగ్రెస్ పార్టీకి సంబంధం ఉందా? లేదా అనే అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి , టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ లు తమ వైఖరిని ప్రకటించాలని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవనాయక్, మాజీ ఎంపీ రవీంద్రనాయక్, రిటైర్డ్ ఐజీ జగన్నాథరావు, ప్రొఫెసర్ అశోక్ లు డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర లంబాడీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో లంబాడీల రిజర్వేషన్- వాస్తవాలు- కుట్రలు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సేవాలాల్ సేన రాష్ట్ర నాయకుడు హుస్సేన్ నాయక్ ఆధ్యక్షతన జరిగిన సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి లంబాడీల పాత్ర ఎం తో ఉందన్నారు. నేడు ఆ పార్టీలో కొనసాగుతున్న సోయం బాబురావు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ లంబాడీలు ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని వేసిన కేసును వెంటనే కాంగ్రెస్ పార్టీ విక్స్ చేయించాలని లేనిపక్షంలో రాష్ట్రంలోని లంబాడీలంతా జరిగే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తారని హెచ్చరించారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగిం చాలనే కుట్రలను ఎదుర్కొవడానికి తీసుకోవాల్సిన భవిష్యత్ కార్యాచరణ కోసం ఈ నెల 4న నగరంలోని బంజారా భవన్లో లంబాడీ సంఘాలన్ని సమావేశం కానున్నాయన్నారు. లంబాడీలు నిజాం పాలన నుంచి తెలంగాణలో ఉన్నారని, నాటి జనాభా లెక్కల్లో ఇది స్పష్టంగా ఉందన్నారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు రాజకీయ పార్టీలు తెరవెనుక కుట్ర చేస్తున్నాయని వాటిని ఎదుర్కొవడానికి రాష్ట్రంలోని లంబాడీలంతా ఏకమై ప్రతిఘటించాలన్నారు. గిరిజనుల రిజర్వేషన్లను తొలగించేందుకు కుట్ర జరుగుతుందని ఆరోపించారు. లంబాడీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాన్ని కలిసి కట్టుగా ఎదుర్కొంటామన్నారు. లంబాడీలు ఎస్టీలు కానేకావద్దని దురభిప్రాయం తీసుకువచ్చేందుకు రాజకీయ కుట్ర అన్నారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్డికి ప్రధాన అనుచరుడని, సోయం బాబురావు ఇటీవల కాంగ్రెస్ చేరడంతో వారిద్దరు కలిసి క ట్ర చేస్తున్నారని ఆరోపించారు. లంబాడీలు 1976లో అక్రమంగా దొడ్డిదారిన వచ్చారని చేస్తున్నవాదన సరైంది కాదన్నారు. 1931 జనాభా లెక్కల్లో 3 లక్షల 516 మంది లంబాడీలు ఉన్నట్లు నిజాం జనాభా లెక్కల్లో ఉందని, ఇందుకు ఆధారాలు ఉన్నాయన్నారు. 1941లో జరిగిన జనాభా లెక్కల ప్రకారం 4 లక్షల మంది ఉన్నారని తెలిపారు. నాడు లంబాడీలు, కోయలు గొండ్ల కోసం నాటి పాలకులు ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ గెజిట్లో కూడా తాము గిరిజనులుగా ఉన్నామన్నారు. లంబాడీల హక్కుల సాధన కోసం ఎంతటి పోరాటానికైనా వెనుకాడమన్నారు. గిరిజన తెగలందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరాంనాయక్, రాజేష్నాయక్, వెంకటేష్ చౌహన్, కల్యాణ్నాయక్, గణేష్నాయక్, సంపత్నాయక్, రవినాయక్, నామా నాయక్. శంకర్నాయక్, శ్రీనునాయక్, ప్రవీణ్నాయక్, శోభనానాయక్ తదితర లు పాల్గొన్నారు.

## చించోలి బైపాస్ రోడ్డు పనులు ఆపాలి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి



విశ్వంభర, మహబూబ్‌నగర్‌: మహబూబ్నగర్ పట్టణ సమీపంలోని తాండూర్ రోడ్డులో సర్వే నంబర్ 942 943 944 సుమారు 3 ఎకరాల 20 గుంటల వఖ్ఫ్ కు సంబంధించిన భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా నేషనల్ హైవే అథారిటీ వారు బైపాస్ రోడ్డు వేస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా భూమి సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ గారికి, మహబూబ్నగర్ అర్బన్ మండల తాసిల్దార్ గారికి, నేషనల్ హైవే ఆర్ అండ్ బి మహబూబ్నగర్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గారికి, వక్ఫ్ బోర్డ్ సీఈఓ గారికి మరియు చైర్మన్ గారికి వినతి పత్రాలు సమర్పించి నప్పటికీ సమస్యను పరిష్కరించటం లేదని మహబూబ్నగర్ పట్టణానికి చెందిన ముస్లిం పెద్దలు, సామాజిక సంఘాల నాయకులు ఆరోపించారు. నేడు మహబూబ్ నగర్ అర్బన్ మండల తహసిల్దార్ గారిని, ఆర్ అండ్ బి నేషనల్ హైవే అథారిటీ అధికారులను కలిసి సమస్యను పరిష్కరించాలని మరోసారి గుర్తు చేశారు. సంవత్సరాల తరబడి సమస్యను పెండింగ్ పెట్టడం సబబు కాదని సంబంధిత అధికారులకు హితవు పలికారు. తమ నిర్లక్ష్య వైఖరిని అధికారులు వదిలిపెట్టని యెడల పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు బైపాస్ రోడ్డు పనులు జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. అనేకసార్లు దరఖాస్తులు ఇచ్చిన పనులు ఆపకుండా కొనసాగించడం పట్ల తీవ్ర అభ్యంతరం తెలిపారు. భూమి పొజిషన్ తేల్చకుండా పనులను ఇదేవిధంగా కొనసాగిస్తే భౌతికంగా పనులను ఆపే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అటువంటి పరిస్థితి ఏర్పడితే సంబంధిత రెవెన్యూ అధికారులు, ఆర్ అండ్ బి నేషనల్ హైవే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్, ఇమాన్ కమిటీ నాయకులు మహమ్మద్ సలీం, ప్రముఖ ముస్లిం సామాజికవేత్త హసన్ చావుస్, జమ్మి అయితే ఇస్లాం నాయకులు మిర్జా బదిఉల్లా బేగ్, గులాం గౌస్ గారు మరియు మైనార్టీ యువకులు సాజిద్ పటేల్, ఉమర్ ఫారూఖ్ , టి ఎఫ్ టి యు జిల్లా నాయకులు జలాల్ పాషా, ఉస్మాన్ మునవర్, అబ్దుల్ సమీ, అబ్దుల్ ముఖిద్ పాల్గొన్నారు.

## హైదరాబాద్ గెజిట్ అమలుకు 'మహా' సర్కారు ఆమోదం..

### జరాంగే విజయ ప్రకటన



విశ్వంభర, నేషనల్ బ్యూరో: మరాఠా వర్గానికి రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్లతో చేస్తున్న పోరాటంలో విజయం సాధించినట్లు ఉద్యమకారుడు మనోజ్ జరాంగే ప్రకటించారు. మరాఠా కోటాపై మహారాష్ట్ర క్యాబినెట్ నియమించిన సబ్ కమిటీ తమ డిమాండ్లలో చాలావరకు ఆమోదించిందని వెల్లడించారు. అర్హులైన మరాఠాలకు కులధ్రువీకరణ పత్రాల జారీ కూడా అందులో ఉందన్నారు. మరోవైపు.. ముంబయిలోని నిరసన స్థలాన్ని ఖాళీ చేసేందుకు బుధవారం ఉదయం వరకు జరాంగేకు బాంబే హైకోర్టు సమయం ఇచ్చింది.మరాఠా కోటాపై ముంబయిలోని ఆజాద్ మైదాన్ వేదికగా మనోజ్ జరాంగే నిరాహార దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మంత్రి రాధాకృష్ణ విఖే పాటిల్ నేతృత్వంలోని సబ్ కమిటీ నేడు ఆయన్ను కలిసింది. 'హైదరాబాద్ గెజిట్'ను అమలు చేయాలనే డిమాండ్‌ను ఆమోదించింది. మరాఠా నిరసనకారులపై గతంలో దాఖలు చేసిన కేసులను సెప్టెంబర్ చివరి నాటికి ఉపసంహరించుకుంటామని తెలిపింది. నిరసనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం, విద్యార్హతల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని కూడా నిర్ణయించినట్లు చెప్పింది. కున్బీలు, మరాఠాలు ఒకే వర్గమని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసేందుకు చట్టపరమైన అవకాశాలను అన్వేషిస్తున్నామని, రెండు నెలల సమయం పడుతుందని మంత్రి రాధాకృష్ణ విఖే పాటిల్ చెప్పారు. ఇదిలా ఉండగా.. ఓబీసీ కింద విద్యా, ఉద్యోగాల్లో మరాఠా వర్గానికి 10 శాతం కోటా డిమాండ్ చేస్తూ ఆగస్టు 29న జరాంగే తన నిరాహార దీక్షను ప్రారంభించారు. తాజాగా ఆయన విజయ ప్రకటనతో ఆజాద్ మైదాన్, పరిసరాల్లోని మరాఠా కోటా నిరసనకారుల్లో సంబరాలు మిన్నంటాయి.

## ర్యాలీలో బైక్ కోల్పోయిన ఓ వ్యక్తి న్యూ బైక్‌ను ఇచ్చిన రాహుల్ గాంధీ!




విశ్వంభర, నేషనల్ బ్యూరో: ఓటర్ అధికార్ యాత్ర ర్యాలీలో బైక్‌ను కోల్పోయిన హోటల్ యజమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సోమవారం న్యూ బైక్‌ను బహుమతిగా ఇచ్చారు. ఆగస్టు 27న దర్భంగాలో రాహుల్ గాంధీ రోడ్‌షో, ర్యాలీ నిర్వహించగా.. సమీపంలో పార్క్ చేసిన బైక్‌లను భద్రతా సిబ్బంది ఆ ర్యాలీకి ఉపయోగించారు. వాటిలో ఆ హోటల్ యజమాని శుభమ్‌కు చెందిన పల్సర్ 220 బైక్ కూడా ఉంది. శుభమ్ తెలిపిన వివరాల ప్రకారం.. మొదట భద్రతా సిబ్బంది టీ తాగడానికి ఆగారు. కొంత సమయం తర్వాత రోడ్ షో కోసం బైక్స్ కావాలని కోరారు. ఈ రోడ్ షో కేవలం 1.5 కిలో మీటర్ల మాత్రమే ఉంటుందని తర్వాత తిరిగి ఇస్తామని హామీ ఇచ్చారు. భద్రతా బృందం అతన్ని కూడా తన బైక్‌పై తీసుకెళ్లింది. కానీ తర్వాత ఎస్‌యూవీకి మారమని కోరారు. అయితే ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే రోడ్‌షో ముగిసిన తర్వాత తన బైక్, భద్రతా సిబ్బంది ఎక్కడా కనిపించలేదు. తర్వాత సిబ్బంది ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అయితే అందులో తన బైక్ కనిపించలేదు.కాంగ్రెస్ నాయకుడు దేవేంద్ర యాదవ్‌కు తెలిసింది. వెంటనే అతన్ని పట్నాకు రావాలని ఆహ్వానించారు. ఓటర్ అధికార్ యాత్ర ముగింపు కార్యక్రమ వేదికపై రాహుల్ గాంధీ స్వయంగా తనకు కొత్త బైక్ తాళాలు అందించినట్లు శుభమ్ తెలిపారు. ర్యాలీలో తను కోల్పోయిన బైక్ మోడల్‌నే బహుమతిగా ఇచ్చారని ధాబా యజమాని శుభమ్ మీడియాకు తెలిపారు.

# ఎవరయ్యా పరాన్నజీవులు ?



ఉపాధి లేనివారా? తల దాచుకోవడానికి గూడు లేనివారా? ఒళ్లు దాచుకోవడానికి గుడ్డలు లేనివారా? ఉపాధి లభించని కారణంగా తిండి లభించనివారా? ఉపాధి కల్పించలేని వ్యవస్థ పెద్దలా ? ప్రజలు చెల్లించే పన్నుల సొమ్ముతో ఇవి కల్పించలేని దేశ రాజకీయ నాయకత్వమా ? రాజకీయ నాయకత్వం అం డతో తేలిగ్గా రుణాలు పొంది వాటిని ఎగవేసేందుకు రుణమా ఫీలు, పన్నుల మినహాయింపులు, రాయితీలు పొందే సూపర్ రిచ్ పారిశ్రామిక, వ్యాపార వర్గమా? ప్రజలు చెల్లించే పన్నులతో జీతాలు,బత్యాలు ఇతర సౌకర్యాలు పొందే అధికార, ఉద్యోగ వర్గమా? వీటిలో ఏది సత్యమో? ఉచితాలతో ప్రజలు పరాన్నజీవులుగా మారి పోతున్నారు అని అనుచిత వ్యాఖ్యలు చేసిన "పెద్ద మనిషి"కి తెలియదా?ఎందుకు తెలియదు. ఆ పెద్ద మనిషి కూర్చున్న కుర్చీ సాధారణ కుర్చీ కాదు కదా. లెజిస్లేచర్, ఎగ్జిక్యూటివ్ వ్యవస్థలకు మార్గదర్శనం చేయవలసిన ఆసనం అది. ఆ రెండు వ్యవస్థలు తప్పులు చేస్తే వాటి చెంప చెళ్లుమనిపించగల అధికారాలు, బాధ్యతలను రాజ్యాంగం దానికి అప్పగించింది. అది స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థ. ఎవరు పరాన్నజీవులో, ఎవరు శ్రమ జీవులో, సొమ్ము ఎవరిదో, సంపదను ఎవరు సృష్టిస్తున్నారో, దాన్ని తేరగా ఎవరు భో%శీ%చేస్తున్నారో, ఎవరి సొమ్ముతో ఎవరు సోకు చేసుకుంటున్నారో, అన్నీ తెలుసు. అంతా తెలుసు. కళ్లకు మాయ పొరలు కమ్ముకున్నాయి. గంతలు తగిలించుకున్నాడు కదా. ఆ గంతలు సత్యాలను చూడనివ్వదు మరి.




# ఒక పాట.. ఎన్నో జీవిత పాఠాలు!

మాట.. పాట.. ఆట. ఈ మూడింటికి అవినాభావ సంబంధమున్నది. ఈ మూడు విడిగా ప్రభావితం చేయగలవు... ఒకదానితో ఒకటి ముడిపడి అనుసంధానమై ప్రభావితం చూపగలవు. మూడింటిలో ఒక్కో దానికి ఒక్కో శక్తి ఉన్నది. దానికి మరొకటి తోడైనా... మూడు ఒకేసారి తోడైనా ఆశక్తి, దాని పట్ల మనకు గల ఆసక్తి అమోఘం. సమాజాన్ని ప్రభావితం చేస్తూ... మంచికి అనుగుణమైన మార్పులు తేవడంలో ఈ మూడు దేనికదే పోటీ పడినట్లుగా ఉంటాయి. ఒక్కోచోట ఒక్కోటి ప్రభావితం చేస్తుంది. కొన్నిచోట్ల ఏవేని రెండు లేదా మూడు తమ శక్తిని చాటుతాయి. కవులు, రచయితలు, గాయకులు, కళా కారులు, వాగ్దాటి గలవారు, ప్రవచనకర్తలు, బోధకులు, ఉపన్యాసకులు వీటిలో ఏ ఒక్కటి గాని రెండు గాని లేదా మూడు కానీ ఉపయోగించుకొని తమ శక్తి మేరకు సమాజాన్ని ప్రభావితం చేసి మంచి మార్పుల కోసం పాటుపడుతుంటారు. ఒక పాట ప్రభావితం చేసిన సందర్భాలు అనేకం. అటువంటి ఒక పాట ఈ మధ్యనేవచ్చిన ఓ చలన చిత్రంలో ఉన్నది. సృష్టిలో అమ్మతనానికి మించిన కమ్మదనం మరొకటి లేదు. ఉండదు. అమ్మది అన్ని వేళలా త్యాగమే. తనకంటూ ప్రత్యేకించి ఏమీ కోరుకోదు. ఆమె ప్రతి కోరిక వెనుక తన భర్త, సంతానం మిళితమై ఉంటారు. సంతానం పట్ల మాతృమూర్తి చూపే ప్రేమ, ఆప్యాయత, అనురాగం కొలతలకు అందనిది. అమ్మ లేని జీవితం అంధకారమే. తన శిశువు గర్భస్థ పిండం నుంచి మొదలుకొని తాను శరీరాన్ని వదిలే వరకు కూడా పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటుంది అమ్మ. తన గత్యంతరం కూడా తన పిల్లలు బాగుండాలని కోరుకుంటుంది. అమ్మ లాలి పాట, జోల పాట ప్రతీది అమృతతత్వమే. తండ్రిది కూడా ఇటువంటి పాత్ర, ప్రయత్నమే. అయినా అతనిది అమ్మ తరువాత స్థానమే. అందుకే తల్లి, తండ్రి, గురువు ఆ తరువాతే దైవమునకు సనాతన ధర్మం చోటునిచ్చింది. అమ్మకు ప్రతిరూపం మరొకటి ఉండదు. ఆ ప్రతిరూపం కూడా మళ్లీ అమ్మే అవుతుంది. అంతటి అమ్మపై ఇప్పటి వరకు ఎన్నో పాటలు వచ్చాయి. వస్తూనే ఉన్నాయి. ఇందులో ఏ ఒక్క దానిని తక్కువ చేసి చూడలేము. కానీ. ఇందులో కొన్ని పాటలు జీవిత పాఠాలను నేర్పుతుంటాయి. అటువంటిదే ఈ పాట. అందులోని చరణాలు. "పచ్చ పచ్చని చేలల్లో... పూసేటి పూవుల తావుల్లో... నవ్వులు ఏరుతు నడిచేద్దాము చేతులు పట్టుకోనా కొడుకా.." జీవితంలో ప్రతీది ప్రకృతి ప్రసాదించవలసినదే. ఈ పాట ప్రారంభం కూడా అక్కడే మొదలైనది. జీవిత గమనాన్ని ప్రారంభించుదాం... చేతులు పట్టుకోమని తన కొడుకుకి ఆ తల్లి చెబుతున్నది. తల్లి లేకుండా జీవితం ప్రారంభించడం అన్నది జరగదు. అందుకే ఆటపాటలకు తల్లినే ఆది గురువు అని చెపుతారు. "కడుపున నిన్ను దాచుకుని... నీడల్లే నిన్ను అంటుకుని... కలిసే ఉంటా ఎప్పటికీ... నీ చేతిని వదలను నా కొడుకా..." అంటూ బతుకు పట్ల భయాన్ని వదిలింప చేసి భరోసాను ఇస్తోంది. ఆట పాటలతో పిల్లలకు బతుకు బాట చూపెడుతుంది అమ్మ. "పదిలంగా నువ్వునడవాలే... పది కాలాలు నువ్వు బతకాలే....నే చందమామకు చెబుతున్నా నిను చల్లగ చూస్తది నా కొడుకా..." తను ఈ భూమి మీద లేకపోతే తన కొడుకు ఏమైపోతాడోనని దిగులుతో ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నది. ఆ తల్లి మనసు ఇక్కడ చాలా స్పష్టం. "ఆకలితో నువ్వు పస్తుంటే... నీ దొక్కలు ఎండిపోయేరా... చెట్టు చెట్టుకి చెబుతున్నా నీ కడుపు నింపమని నా కొడుకా..." తల్లి తన సంతానం కడుపు నింపడానికే ప్రాధాన్యతరిస్తుంది. తాను లేని పక్షంలో కూడా తన కొడుక్కి కడుపు నింపేలా తీసుకున్న జాగ్రత్తలను ఈ చరణంలో వివరిస్తున్నది. పిల్లల కడుపు నింపేందుకు తాను ఉపవాసం ఉన్న తల్లులు ఎందరో ఉన్నారు. "నిద్దుర లేక నువ్వుంటే... నీ కన్నులు ఎర్రగ మారేరా... నీలి మబ్బుతో చెబుతున్నా నీ జోల పాడమని నా కొడుకా..." కడుపు నింపడమే కాదు కంటి నిండా నిద్రపోయేందుకు కూడా జాగ్రత్తలు తీసుకుంటున్నది. "మనిషికి మనిషే దూరమురా... ఇది మాయాలోకపు ధర్మమురా... బడిలో చెప్పని పాఠం ఇదిరా బతికే నేర్చుకో నా కొడుకా... " మానవత్వం దూరమవుతున్న ఈ రోజుల్లో ఎలా బతకాలో... జీవితం గమనం ద్వారా జీవిత పాఠాలు నేర్చుకోమని కూడా చెప్తున్నది. "తిడితే వాళ్లకే తగిలేను... నిను కొట్టిన చేతులు విరిగేను... ఒద్దిక నేర్చి ఓర్చుకునుండు ఓపిక తోటి నా కొడుకా... " అన్ని బాధలను కూడా ఓపికతో ఓర్చుకోవాలని సూచిస్తున్నది."రాళ్లు రప్పల దారులు నీవి.. అడుగులు పదిలం ఓ కొడుకా.. మెత్తటి కాళ్ళు ఒత్తుకుపోతాయి చూసుకు నడువురా నా కొడుకా... " జీవితంలో నడిచే దారి అనేక ఒడిదుడుకులతో ఉంటుందని వాటన్నిటిని తగు జాగ్రత్త చూసుకొని ముందుకు సాగాలని హితబోధ చేస్తున్నది. "చుక్కలు దిక్కులు నేస్తులు నీకు చక్కగ బతుకు ఓ కొడుకా ఒక్కనివనుకోని దిగులైపోకు పక్కనే ఉంటా నా కొడకా... " నీ జీవిత ప్రయాణంలో నీవు ఒక్కడివేనని బాధపడకు నీ చేయి పట్టుకుని వెంటనే ఉంటానన్న అభయం ఇస్తోంది. "ప్రాణం నీది పిట్టల తోడిది ఉచ్చుల పడకు ఓ కొడుకా... ముళ్ళకంపలో గూడు కట్టేటి నేర్పుతో ఎదగరా నా కొడకా..." పక్షుల వలె వేటగాళ్ల వలలో చిక్కుకోవద్దని ముళ్ళకంపలోనైనా గూడు కట్టుకొని ఎదగమని సూచిస్తున్నది.

"ఏ దారిలో నువ్వు పోతున్న ఏ గండము నీకు ఎదురైనా ఏ కీడు ఎన్నడూ జరగదు నీకు అమ్మ దీవెనది నా కొడకా.."

"ఈ దిక్కులు నీతో కదిలేను... ఈ చుక్కల దిష్టి తీసెను ఏ గాలిదూళి నీకు సోకదు నిన్ను అమ్మ దీవెనిది నా కొడకా..."

"ఏ పిడుగుల చప్పుడు వినపడినా ఏ బూచోడికి నువ్వు భయపడినా... ఈ చీకటి నిన్నేం చేయదులేరా అమ్మ దీవెనది నీ కొడుకా...అమ్మ దీవెనిది నీ కొడుకా...". నా దీవెన ఉన్నంతవరకు ఏ గండాలు, కీడులు సోకవని, పిడుగులు కూడా ఏమీ చేయలేవని అభయమిస్తోంది ఆ మాతృమూర్తి.

బతుకు నివ్వడమే కాదు... బతుకు బాట చూపేది అమ్మనే... అభయాన్ని ఇచ్చేది ఆమెనే. పదాలు చిన్నవే అయినా... ఈ పాటలో ఉన్న పరమార్థం అమోఘం. ఈ పాట మనిషి జీవితంలో అనేక పాఠాలు నేర్పుతున్నది. అందుకే ఈ పాట, మరెన్నో ఇటువంటి పాటలు వృధా కాకూడదు. తల్లిదండ్రుల జీవన పర్యంతం పిల్లలు వారి వద్దనే నివసిస్తున్న భావన కలుగజేయాలి. సంతాన ఉన్న ఏ తల్లిదండ్రులు అనాధలు కాకూడదు. వృద్ధాశ్రమాలు లేని, వాటి అవసరం లేని సమాజాన్ని నిర్మిద్దాం. అనాధలకు కూడా అండగా ఉందాం. వారిని అక్కున చేర్చుకుందాం. ఇటువంటి పాటల స్ఫూర్తితో నైనా మంచి మనసున్న మనుషులుగా జీవిద్దాం.



బాశెట్టి శ్రావణ్ కుమార్,
సీనియర్ జర్నలిస్ట్,
7207201154

# అనైతిక రాజకీయ జూదంలోకి ఓటర్లు



గత కొన్ని దశాబ్దాలుగా ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల, ఆధిపత్య కులాల పదవుల పందెంలో జరిగిన రాజకీయ పోరులో సమాజంలో అనేక రకాల అనైతిక పోకడలు వేళ్ళునుకు పోయాయి. అవి సామాన్య , మధ్యతరగతి ఓటర్ల జీవితాలలో శాశ్వతంగా వేళ్ళునుకుపోయి భద్రంగా ఉండే స్థాయికి చేరుకున్నాయి. ప్రధానంగా స్థానిక పంచాయతీరాజ్ ఎన్నికల సందర్భంలో ఓటర్ల వ్యక్తిగత జీవితంలోకి ప్రవేశించి సూక్ష్మస్థాయిలో విపరీతంగా ప్రభావితం చేస్తాయి. ఓటు ఉన్న ప్రతి వ్యక్తి ఎన్నికల మాయలోకి లాగాబడుతున్నాడు. ఇది వారి వ్యక్తిత్వాన్ని సన్మార్గంలో నుండి తప్పుడు మార్గంలోకి నెమ్మదిగా తనను తాను మరిచిపోయి దిగ జారిపోతాడు. అంతేకాకుండా తన కుటుంబ సభ్యులను కూడా అనైతిక రాజకీయ జూదంలోకి లాగేసుకుపోతాడు.పంచాయతీరాజ్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించుకోవడానికి అనేక రకాల అనైతిక, అక్రమ మార్గాలను ఎంచు కోవడం జరుగుతుంది. ఇది ప్రజల జీవితాలలో నైతిక విలువలు దిగజారి పోవడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించడానికి కులాల వారిగా, మతాలవారీగా, వర్గాల వారీగా వారిని సంతృప్తిపరిచే విధంగా డబ్బుల రూపేనా, మద్యం రూపేనా, వస్తువుల రూపేనా వివిధ ప్యాకేజీల రూపంలో వారికి అందజేస్తున్నారు. యువకులను ఆకర్షించడానికి క్రీడా వస్తువులు సమకూర్చడం, ఇంకా మరి ఏదైనా రూపంలో వారిని సంతృప్తి పరుస్తున్నారు. ప్రధానంగా ఎన్నికల సమయంలో గ్రామాలలో వాడవాడలా మద్యం ఏరులై పారటం ఓటర్లలో తాగుబోతుతనం తారస్థాయికి చేరుకోవడం సాధారణమైపోయింది. ఎన్నికల సమయంలో జరుగుతున్న అనేక చట్ట విరుద్ధ కార్యకలాపాలను నియంత్రించడానికి కావాల్సిన అధికార యంత్రాంగం కానీ, స్వచ్ఛంద సంస్థలు గాని, పౌర సమాజం కానీ తమ వంతు బాధ్యతగా ముందడుగు వేయడం లేదు.నేడు మనం అనుసరిస్తున్న నిర్లక్ష్యం వైఖరి భవిష్యత్తు ప్రమాదం పొంచి ఉన్నదని గమనించుకోవాలి.

## ఎన్నికలు నేర్పిస్తున్న కొత్త వ్యసనాలు..!

ఎన్నికలు ప్రజలలో ఎన్నో రకాల కొత్త వ్యసనాలను అలవాటుగా మార్చింది. ఆ వ్యసనాలు ప్రజల మెదలలో చాలా బలంగానే నాటుకుపోయాయి. వాటిని మరిపించడం అంత సులభం అయ్యే పని కాదు. ప్రజలలో మూడు దశాబ్దాల కాలం క్రితం లేని వ్యసనాలన్నీ ఇప్పుడు సాధారణం అయిపోయాయి. నాడు ఏ పండుగకు లేదా చుట్టము వస్తే కానీ గ్రామీణ ప్రజలు మాంసం మద్యం సేవించేవారు కాదు. కానీ, నేడు ప్రతిరోజు మద్యం సేవించడం అలవాటుగా మారింది. ఈ వ్యసనం కచ్చితంగా ఎన్నికల సమయంలో నేర్చుకున్న వ్యసనమే. కొంత మంది అయితే పచ్చి తాగుబోతులుగా తయారవుతున్నారు. ఎన్నికల తర్వాత అదే అలవాటు కొనసాగడం వలన ఆర్థికంగా క్షీణించిపోయి చాలా కుటుంబాలు బజారున పడడ మే కాకుండా మరి ఎంతోమంది ఆరోగ్యాలను క్షీణింప చేసుకొని అర్ధాంతరంగా ప్రాణాలను కోల్పోయిన ఎంతోమంది గ్రామాల్లో దర్శనమిస్తున్నారు.ఎన్నికల పుణ్యమా అని తాగుడుకు బానిసలై అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోయే వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. దీనికంతటికి పదే పదే ఎన్నికలు జరగడం ఒక ప్రధాన కారణంగా చెప్పాలి.ఎన్నికల సందర్భంలో ఓటర్లు అభ్యర్థి దగ్గరికి వెళ్లి డబ్బులు అడుక్కొను కొనే స్థాయికి జారిపోయారు. మా కుటుంబంలో ఇంత మంది ఓటర్లు ఉన్నారు. ఇంత డబ్బులు ముడితే కానీ ఇతరత్రా వారి చిన్నచిన్న కోరికలు పూర్తి చేస్తే కానీ ఓటు వేయని పరిస్థితి. మెజారిటీ ఓటర్లు బాహాటంగానే అభ్యర్థుల నుంచి మద్యం సీసాలు, డబ్బులు తీసుకునే స్థాయికి దిగజారిపోయారు. నిజాయితీగా ఓటేసే ఓటరే కరువై పోయాడు అని చెప్పడానికి సందేహించవలసిన అవసరం లేదు. ఓటరు ఇంత దారుణమైన పరిస్థితుల్లోకి దిగజారి పోవడానికి కారణమైన పరిస్థితులేంటో చాలా క్షుణ్ణంగా అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది.ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నెముక అయినా ఓటరు అత్యంత భయంకరమైన మాయా ప్రపంచంలో ప్రలోభాల ప్రపంచంలో బందీ కావడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదం.

## నియంత్రించే యంత్రాంగం అవసరం..!

ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు పోటీ చేస్తున్న అభ్యర్థులు పెట్టే ఖర్చు భారీగా పెరిగిపోయింది. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థి పెట్టవలసిన ఖర్చు ఎన్నికల సంఘం నిర్ణయించినప్పటికీ దానికి ఎన్నో రెట్లు అదనంగా ఖర్చు చేస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే అభ్యర్థులు ఎన్నికల్లో నల్లధనాన్ని ఖర్చు చేస్తున్నారు అని చెప్పాలి. ఇది ఓటర్ల పాలిట ఒక శాపంగా మారింది. అభ్యర్థులు చేసే ఖర్చును ఎప్పటికప్పుడు రోజువారీగా నియంత్రించడానికి కావాల్సినంత ఎన్నికల అధికార యంత్రాంగం లేకపోవడమే అభ్యర్థులకు అదృష్టంగా కలిసి వస్తుంది. మూడో కంటికి తెలియకుండానే గుట్టు చప్పుడు కాకుండా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ పనిని పూర్తి చేయించుకోగలుగుతున్నాయి. ఇది కచ్చితంగా ఎన్నికల సంఘం తగినంతగా యంత్రాంగం పర్యవేక్షణ, నియంత్రణ, ఏర్పాట్లు చేసుకోకపోవడం వలనే ఈ రకమైన దుష్పరిణామాలు సమాజంలో చోటు చేసుకుంటున్నాయి.అవకాశం దొరికితే రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఓటర్లు సైతం ప్రజాస్వామ్య వ్యవస్థను కూనీ చేస్తారు అనేది తేటతెల్లమైపోయింది. ఎన్నికల ప్రక్రియ చాలా సవ్యంగా ప్రజాస్వామ్య వ్యవస్థ విజయవంతం అవుతుంది. ఎన్నికల సంఘం పటిష్టమైన ఎన్నికల నియమావళిని రూపొందించి కచ్చితంగా అమలు చేయవలసిన ఆవశ్యకత ఉంది. పౌర సమాజం కూడా ఎన్నికల సమయంలో తమ వంతు బాధ్యతను నిర్వహించవలసిన అవసరం చాలానే ఉంది.



నాగుల వేణు యాదవ్
అసిస్టెంట్ ప్రొఫెసర్

# ఆస్పత్రి ఐసీయూలో.. ఇద్దరు శిశువులను కరిచిన ఎలుకలు!



విశ్వంభర, నేషనల్ బ్యూరో: ప్రభుత్వ ఆస్పత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ)లో ఉన్న ఇద్దరు శిశువులను ఎలుకలు కరిచిన ఘటన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో చోటుచేసుకుంది. దీనిపై సత్వరమే స్పందించిన అధికారులు దర్యాప్తును ప్రారంభించారు. వివరాల్లోకి వెళ్తే.. వారం కిందట జన్మించిన ఆ ఇద్దరు శిశువులను, రాష్ట్రంలోని అతిపెద్ద ఆస్పత్రుల్లో ఒకటైన మహారాజ యశ్వంతరావు చికిత్సాలయ(ఎమ్‌వైహెచ్)లోని నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఎన్ఐసీయూ)లో చేర్చారు. ఐసీయూలో చికిత్స తీసుకుంటున్న ఆ శిశువుల శరీరాలపై గాయాలను గుర్తించిన నర్సుల బృందం డాక్టర్లకు సమాచారం అందించారు. దీంతో ఐసీయూలో ఉన్న సీసీటీవీని పరిశీలిస్తే.. ఆ పసిపిల్లల వద్దకు ఎలుకలు వచ్చిన దృశ్యాలు కనిపించాయి. దీంతో అవే శిశువులను గాయపరిచినట్లు అనుమానిస్తున్నారు. మొదటగా ఈ ఘటన ఆదివారం జరగ్గా.. మరసటి రోజే మరో ఘటన జరగడం గమనార్హం. దీంతో అక్కడి వైద్య నిర్వహకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోందని శిశువుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.ఆస్పత్రి కిటికీలకు బలమైన ఐరన్ నెట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ యాదవ్ మంగళవారం తెలిపారు. అంతేకాకుండా రోగులకు సహాయంగా ఉన్న వారు ఆహార పదార్థాలను వార్డులకు తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు.దర్యాప్తు చేయడానికి ఓ కమిటీని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ అశోక్ యాదవ్ వెల్లడించారు.

# అత్యాచారం కేసులో ఎమ్మెల్యే అరెస్టు.. కస్టడీ నుంచి పరార్

విశ్వంభర, నేషనల్ బ్యూరో: అత్యాచారం, మోసం ఆరోపణలపై పంజాబ్‌కు చెందిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యే హర్మీత్‌సింగ్ ధిల్లాన్‌ను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. ఈక్రమంలో ఆయన్ను స్టేషన్‌కు తరలిస్తుండగా.. పోలీసులపై కాల్పులు జరిపి హర్మీత్ పరారయ్యారు. అసలేం జరిగిందంటే.. పటియాలాలోని సనూర్ నియోజకవర్గానికి హర్మీత్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జిరాక్‌పుర్‌కు చెందిన ఓ మహిళ ఆరోపణల మేరకు హర్మీత్‌పై కేసు నమోదైంది. తనకు విడాకులయ్యాయని చెప్పి.. ఎమ్మెల్యే తనతో సంబంధం కొనసాగించాడని ఆ మహిళ ఆరోపించింది. ఆ తర్వాత తనపై బెదిరింపులకు పాల్పడ్డాడంటూ.. ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ ఆరోపణల నేపథ్యంలో కర్నాల్‌లో పోలీసులు ఎమ్మెల్యేను అరెస్టు చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తుండగా.. హర్మీత్, ఆయన సహాయకులు అధికారులపై కాల్పులు జరిపారు. అనంతరం అక్కడ ఉన్న కార్లలో పారిపోయారు. ఎమ్మెల్యే, ఆయన అనుచరులను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. కాగా.. ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన హర్మీత్.. ఇది తనపై జరిగిన రాజకీయ కుట్రగా పేర్కొన్నారు.



# ఉచితం.. అనుచితమా?

ఉచితం అనుచితమే! అనే ఒక వాదన ఈ మధ్య పెరిగిపోతున్నది. ఆ వాదనకు మద్దతు కూడా పెరుగుతున్నది.మధ్య తరగతి,ఎగువ మధ్య తరగతుల్లో,సోషల్ మీడియా ద్వారా ఈ వాదం బాగా ప్రచారమవుతు న్నది.తాము చెల్లించే పన్నుడబ్బులతో పేదలను ఉచిత పథకాలతో పోషిస్తున్నారు అనే ఓ ఆక్రోశం వ్యక్తమవుతున్నది.ఈ వాదన కు మీడియా (మొత్తం మీడియా కాదు,ఒక సెక్షన్ మాత్రమే)లో కూడా మద్దతు లభించడం విచిత్రమైన సంగతి బలపడుతున్నది.అయితే ఇది ఎంత వరకు నిజం? నిజమే ఉచితం అనుచితమే. ఉచిత పథకాలు హేతుబద్ధం గా ఉండవలసిందే. అయితే ఉచితాలు ఎవరు కోరుకుంటున్నారు. ఈ పథకాలు కడుపు నిండిన వారి కోసం కాదు గదా. ఉపాధి లేని వారు, సరైన ఆదాయ వనరులు లేని వారు. అలాంటి అవకాశాలు అసలే లేని వారి కోసం కదా ఈ పథకాలు.ఆర్థిక అసమానతలను సరిదిద్దే సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వం కొన్ని ఉచితాలను అందించడం సబబే.అయితే అన్నీ ఉచితాలుగా ఇవ్వడం,ఇవ్వజూపడం సమర్థనీయం ఏమీ కాదు. అన్నీ ఉచితంగా ఇవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారా? ఎలాంటి పరిస్థితులు వారిని ఉచితాల వైపునకు ఆకర్షిస్తున్నాయి? ఆర్థిక అంతరాలను సరిదిద్దవలసిన కర్తవ్యాన్ని రాజకీయ నాయకత్వం మరచి పోయిన ఫలితమే ఉచిత పథకాలు కాదా? తమ అధికారం కోసం దగ్గరి దారిగా తాయిలాలను ఉచిత పథకాలుగా మొదలుపెట్టింది, కొనసాగిస్తున్నది నిజం కాదా? నిత్య జీవన కనీస అవసరాలైన కూడు,గుడ్డ లను సైతం సమకూర్చుకోలేని దుస్థితి ఫలితంగా ప్రజలు ఆ ఉచితాలకు ఆకర్షితులవడం,అలవాటుపడిపోవడం కొనసాగుతున్నదనేది నిజం కాదా?అందుకు గాను ప్రజలను నిందించడం ఈమేరకు ఎలా సబబు? అయితే ఈ దుస్థితికి ఎవరు బాధ్యులు? ఎవరిని నిందించాలి?దేశంలో ఉన్న వనరులను ఉత్పాదక దిశలో వినియోగంలోకి తెచ్చి, సంపదను సృష్టించే మార్గాలను రచించి,అమలు చేసి ప్రజలను ఆర్థికంగా శక్తిమం తులుగా చేయగలిగితే ఉచితాల అవసరం,అగత్యం ఉండదు కదా.ఈ సత్యాన్ని మరచిపోయి ప్రజలను నిందించడమేమిటి? బతకడాని(జీవన నైపుణ్యాలను)కి ఉపకరించే చదువును బోధించే విధంగా విద్యారంగాన్ని తీర్చిదిద్దగలిగితే ఈ ఉచితాల కోసం జనం ఎందుకు ఆశపడతారు? ఆ దిశలో రాజకీయకత్వం పని చేయడడం లేదెందుకు? దేశం స్వతంత్రమైపోయి 75 ఏళ్ళు గడిచిపోయాయి. రాజ్యాంగం అమలులోకి వచ్చి 72 ఏళ్ళు గతించిపోయాయి. ఇంకా.. రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం ఏమిటి?పనికి ఆహారం పథకం ఏమిటి అర్థం లేకుండా. సాగుకు యోగ్యమైన అపారమైన భూమి.దేశం నలుమూలలా పారుతున్న ఎన్నో జీవనదులు. అపారమైన సహజ వనరులు. పుష్కలమైన మానవ వనరులు. పరిశ్రమల స్థాపనకు అనువైన అనేక వనరులు,తద్వారా కలిగే అపారమైన ఉపాధి అవకాశాలు. వాటి ద్వారా ప్రజలకు సమకూరగల ఆర్థిక స్వయం సమృద్ధి. వీటిని..ప్రణాళికా బద్ధంగా వినియోగించుకోలేని అసమర్థత అనేది సత్యం కాదా?ఈ వనరులను సమర్థంగా వినియోగించుకోగలిగి ఉంటే ఇండియా ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశంగా మిగిలిపోయి ఉండేది కాదు కదా. బ్రిటీష్ ఇండియాకు, స్వత్రంత్ర భారత్ కు వ్యత్యాసం ఏమిటి?పెద్దగా ఏమీ లేదు. పెద్దగా సాధించింది కూడా ఏమీ లేదు. ఏమీ సాధించలేదు అని చెప్పలేం. కాని కొంత ప్రగతి సాధిం చింది నిజమే. కానీ 75 ఏళ్లలో ఓ జాతి సాధించ గలిగిన ప్రగతి మాత్రం సాధించలేదు అని ఖచ్చితంగా చెప్పాలి. దీనికి నిందించవలసింది సామాన్య జనాన్ని ఎంత మాత్రం కాదు. ఒకవేళ బాధ్యులైనా అది కొంత మేరకు మాత్రమే.



బాధ్యులు అయితే పరోక్షంగా మాత్రమే. అధికారానికి అలవాటు పడిపోయి దానికి అడ్డ దారి అయిన ఉచిత పథకాలను ఎంచుకున్న రాజకీయనాయకత్వం మాత్రమే బాధ్యత వహించాలి.

గండె గోవర్ధన్

# కొత్త స్పాన్సర్ కోసం బీసీసీఐ ప్రయత్నం


టీమిండియా లీడ్ స్పాన్సర్‌గా డ్రీమ్11 తప్పుకోవడంతో కొత్త స్పాన్సర్ కోసం బీసీసీఐ ప్రయత్నిస్తోంది. దీని కోసం ప్రముఖ కంపెనీల నుంచి బిడ్లు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించింది. ఆసక్తి ఉన్న సంస్థలు సెప్టెంబరు 16లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు తీసుకొచ్చి ఫాంటసీ స్పోర్ట్స్‌ను నిషేధించడంతో డ్రీమ్11 భారీగా నష్టపోయింది. ఈ క్రమంలోనే టీమిండియా స్పాన్సర్‌షిప్ నుంచి కూడా తప్పుకుంది. దీంతో ఆసియా కప్‌లో స్పాన్సర్ లేకుండానే టీమిండియా ఆడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అందుకని ఈ విషయంలో తొందరపడకూడదని బీసీసీఐ ఏపెక్స్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. అయితే సెప్టెంబరు 30 నుంచి భారత మహిళల వన్డే వరల్డ్ కప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఆ సమయానికల్లా కొత్త స్పాన్సర్‌ను పట్టేయాలని బీసీసీఐ భావిస్తోంది. 2027 పురుషుల వన్డే వరల్డ్ కప్ వరకైనా ఈ కొత్త స్పాన్సర్‌షిప్ కొనసాగేలా బీసీసీఐ ప్లాన్ చేస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం డ్రీమ్11 లేదా మరే ఇతర గేమింగ్ కంపెనీలతో బీసీసీఐ ఎలాంటి స్పాన్సర్‌షిప్ డీల్ కొనసాగించలేదని బీసీసీఐ సెక్రటరీ దేవాజిత్ సైకియా చెప్పారు. అందుకే కొత్త స్పాన్సర్ కోసం బిడ్‌లు ఓపెన్ చేసినట్లు వెల్లడించారు. బీసీసీఐ నిబంధనల ప్రకారం, టీమిండియా స్పాన్సర్‌షిప్ కోసం బిడ్లు వేసే కంపెనీలకు చివరి మూడు సంవత్సరాల్లో కనీసం రూ.300




కోట్ల టర్నోవర్ ఉండాలి. లేదా మూడేళ్లుగా కంపెనీ నెట్ వర్త్ రూ.300 కోట్లపైన ఉండాలి. బీసీసీఐ నిబంధనలతో కన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రస్ట్ ఉండకూడదు. ఫ్రాడ్, ఆర్థిక నేరాలు వంటి క్రిమినల్ కేసులు ఉండకూడదు. రెండేళ్ల కన్నా ఎక్కువ జైలుశిక్ష పడే ఎలాంటి కేసు ఉండకూడదు. విల్‌ఫుల్ డిఫాల్టర్‌గా ఆర్బీఐ భావించకూడదు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, గ్యాంబ్లింగ్, క్రిప్టోకరెన్సీ సంబంధిత వ్యాపారాలు, ఆల్కహాల్, టొబాకో, పోర్నోగ్రఫీ లేదా ఇతర అఫెన్సివ్ కంటెంట్, ఇతర సరోగేట్ బ్రాండింగ్ చేసే కంపెనీలు ఈ బిడ్స్‌లో పాల్గొనడానికి అర్హులు కాదని బీసీసీఐ స్పష్టంచేసింది.

# గాఫ్ ఔట్.. నవోమి ఒసాకా చేతిలో ఓటమి

న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో మరో సంచలనం నమోదైంది. గతంలో నాలుగు సార్లు గ్రాండ్‌స్లామ్స్ గెలిచినా ఇటీవల కాలంలో స్థాయికి తగ్గట్టు ఆడటంలో తడబడుతున్న జపాన్ భామ, 23వ సీడ్‌గా బరిలోకి దిగిన నవోమి ఒసాకా ఈ టోర్నీ ప్రిక్వార్టర్స్‌లో 2023 చాంపియన్ కోకో గాఫ్‌నకు షాకిచ్చి క్వార్టర్స్ చేరింది. సోమవారం అర్ధరాత్రి ఆర్థర్ ఆషే స్టేడియంలో జరిగిన మహిళల సింగిల్స్ నాలుగో రౌండ్ మ్యాచ్‌లో ఒసాకా.. 6-3, 6-2తో మూడో సీడ్ గాఫ్‌ను మట్టికరిపించి 2021 తర్వాత ఈ టోర్నీలో లాస్ట్ 8 దశకు అర్హత సాధించింది. క్వార్టర్స్‌లో ఒసాకా 11వ సీడ్ చెక్ ప్లేయర్ కరోలినా ముచోవాతో తలపడనుంది. మరో పోరులో ఇగా స్వియాటెక్ (పోలండ్) 6-3, 6-1తో అలగ్జాంద్రోవా (రష్యా)ను ఓడించి క్వార్టర్స్ చేరుకుంది. ఆమెతో పాటు అమెరికా అమ్మాయి అమండ అన్సిమొవ సైతం క్వార్టర్స్‌కు ప్రవేశించింది. మహిళల డబుల్స్‌లో అమెరికా టెన్నిస్ దిగ్గజం వీనస్ విలియమ్స్, లైలా ఫెర్నాండెజ్ (కెనడా) ద్వయం 6-3, 6-4తో అలగ్జాంద్రొవ (రష్యా), ఝాంగ్ షువాయ్ (చైనా)ను ఓడించి క్వార్టర్స్‌కు చేరుకుంది. పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు యుకీ బాంబ్రీ, మైఖెల్ వీనస్ జోడీ ప్రిక్వార్టర్స్ చేరింది. పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో ఈ ఇండో అమెరికన్ ద్వయం 6-1, 7-5తో గొంజాలో ఎస్కోబార్ (ఈక్వెడార్), రేయెస్ వరెల (మెక్సికో)ను ఓడించింది. ఒక చిత్రం వెయ్యి పదాలకు సమానం అంటారు! దీన్ని నిజం చేస్తూ యూఎస్ ఓపెన్‌లో ఇటలీ భామ జాస్మిన్ పాలోని అదిరిపోయే ఫ్రేమ్‌లో బందీ అయిపోయింది. ఫొటోగ్రాఫర్ రే



జిబిలో తీసిన ఈ ఫొటో టోర్నీకే హైలెట్‌గా నిలిచింది. 'వన్ ఇన్ ఏ మిలియన్' ఇమేజ్‌ను తలపిస్తూ పాలోని ముఖం రాకెట్‌లో అలా అతికినట్లు సరిపోవడం అందరినీ ఆకట్టుకుంటున్నది. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సిన్నర్ తుది ఎనిమిదిలోకి చేరుకున్నాడు. ప్రిక్వార్టర్స్‌లో ఈ ఒకటో సీడ్ ఇటలీ కుర్రాడు 6-1, 6-1, 6-1తో అలగ్జాండర్ బబ్లిక్ (కజకిస్థాన్)పై అలవోక విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో లొరెంజొ ముసెట్టి (ఇటలీ) 6-3, 6-0, 6-1తో జామె మునర్ (స్పెయిన్)ను చిత్తుచేశాడు. క్వార్టర్స్‌లో సిన్నర్.. తన దేశానికే చెందిన ముసెట్టితో అమీతుమీ తేల్చుకోనున్నాడు. ఫెలిక్స్ అగర్ అలీఅస్సీమ్ (కెనడా), టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) కూడా తమ ప్రత్యర్థులను ఓడించి క్వార్టర్స్ చేరుకున్నారు. క్వార్టర్స్‌లో ఫ్రిట్జ్.. జొకోవిచ్‌తో తలపడనున్నాడు

# టీ20లకు గుడ్ బై..
## ఆసీస్ స్టార్ మిచెల్ స్టార్క్ షాకింగ్ ప్రకటన



ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. ఇకపై వన్డేలు, టెస్టులపైనే ఫోకస్ పెట్టాలని అనుకుంటున్నానని, అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నానని స్టార్క్ వెల్లడించాడు. కెరీర్లో ఆస్ట్రేలియా తరఫున 65 టీ20లు ఆడిన స్టార్క్.. తన అద్భుతమైన బౌలింగ్‌తో టీంకు ఎన్నో మరపురాని విజయాలందించాడు. ముఖ్యంగా 2021 టీ20 వరల్డ్ కప్ గెలిచిన ఆసీస్ టీంలో కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాత పొట్టి ఫార్మాట్ గేమ్స్ ఏవీ స్టార్క్ ఆడలేదు. 'నాకు టెస్టులు చాలా ముఖ్యం. అందుకని టీ20లు ఎంజాయ్ చేయలేదని కాదు. ఆస్ట్రేలియా తరఫున టీ20లు ఆడిన ప్రతిక్షణాన్ని ప్రేమించా' అని స్టార్క్ వివరించాడు. అయితే త్వరలో భారత్‌లో జరగబోయే టెస్టు సిరీస్, ఆపై 2027లో జరిగే వన్డే వరల్డ్ కప్ మీద తాను ఫోకస్ పెడుతున్నానని చెప్పాడు. 'ఈ రెండు టోర్నీల కోసం ఎదురు చూస్తున్నా. వీటిలో ఫ్రెష్‌గా ఉండాలంటే టీ20 రిటైర్‌మెంట్ నిర్ణయమే సరైందని నా నమ్మకం' అని చెప్పుకొచ్చాడు. తను ఇప్పుడు తప్పుకుంటే.. 2026 టీ20 వరల్డ్ కప్ కోసం మరో పేసర్‌ను సిద్ధం చేసేందుకు కూడా సమయం ఉంటుందని అభిప్రాయపడ్డాడు. ఫార్మాట్ ఏదైనా తన అద్భుతమైన బౌలింగ్‌తో చెలరేగే స్టార్క్‌ను తాము కచ్చితంగా మిస్ అవుతామని, అయితే అతని నిర్ణయాన్ని గౌరవిస్తున్నామని ఆస్ట్రేలియా టీం చీఫ్ సెలెక్టర్ జార్జ్ బెయిలీ చెప్పాడు. తను ఆడిన 65 అంతర్జాతీయ టీ20 మ్యాచుల్లో స్టార్క్ మొత్తం 1458 బంతులు విసిరాడు. ఓవరాల్‌గా 1881 పరుగులు సమర్పించుకొని 79 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ లెక్కలు చూస్తే అద్భుతమైన బౌలర్‌గా పేరున్న స్టార్క్‌కు పొట్టి ఫార్మాట్ అంతగా అచ్చిరాలేదనే చెప్పాలి.

# సౌతాఫ్రికా ఘనవిజయం

లీడ్స్: : ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీసును సౌతాఫ్రికా ఘనవిజయంతో మొదలుపెట్టింది. టాస్ గెలిచిన బౌలింగ్ ఎంచుకున్న సౌతాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా నమ్మకాన్ని స్పిన్నర్ కేశవ్ మహరాజ్ (4/22) నిలబెట్టాడు. అతనికి వియాన్ ముల్డర్ (3/33) జతకలవడంతో ఇంగ్లండ్ ఏ దశలోనూ మంచి స్కోరు చేసేలా కనిపించలేదు. ఓపెనర్ జేమీ స్మిత్ (54) అర్ధశతకంతో రాణించినా మిగతా ప్లేయర్లలో ఒక్కళ్లు కూడా 15-పరుగుల స్కోరు దాటలేకపోయారు. దీంతో ఇంగ్లండ్ జట్టు 24.3 ఓవర్లలో కేవలం 131 పరుగులకు ఆలౌట్ అయింది. స్వల్ప లక్ష్య ఛేదనలో సఫారీలకు ఎయిడెన్ మార్క్రమ్ (86), ర్యాన్ రికెల్టన్ (31 నాటౌట్) అదిరిపోయే ఆరంభం అందించారు. చివర్లో మార్క్రమ్, బవుమా (6), ట్రిస్టన్ స్టబ్స్ (0) స్వల్ప వ్యవధిలోనే అవుటైనా.. డెవాల్డ్ బ్రెవిస్ (6 నాటౌట్)తో కలిసి రికెల్టన్ లాంఛనం పూర్తిచేశాడు. సౌతాఫ్రికా కేవలం 20.5 ఓవర్లలో




మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి, సిరీసులో 1-0 ఆధిక్యం సాధించింది. అద్భుతమైన బౌలింగ్‌తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చిన మహరాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది. ఈ రెండు టీమ్స్ మధ్య రెండో వన్డే గురువారం నాడు లార్డ్స్ వేదికగా జరగనుంది.

## టీ20ల్లో అత్యధిక వికెట్లు.. దిగ్గజ పేసర్‌ను దాటేసిన రషీద్ ఖాన్



పొట్టి క్రికెట్‌లో ప్రమాదకరమైన బౌలర్‌గా పేరొందిన రషీద్ ఖాన్‌సరికొత్త చరిత్ర లిఖించాడు. తనకు అచ్చొచ్చిన టీ20ల్లో అత్యధిక వికెట్ల వీరుడిగా అవతరించాడీ అఫ్గనిస్థాన్ కెప్టెన్. పురుషుల పొట్టి ఫార్మాట్లో 164 వికెట్లతో దిగ్గజ బౌలర్లకు సాధ్యంకాని రికార్డు నెలకొల్పాడీ మిస్టరీ స్పిన్నర్. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌పై తన స్పెల్ చివరి బంతికి ధ్రువ్ పరాషర్‌ను ఔట్ చేసి రషీద్ ఈ మైలురాయికి చేరుకున్నాడు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో మ్యాచ్‌కు ముందు టీ20 అత్యధిక వికెట్ల వీరుల జాబితాలో రషీద్ రెండో స్థానంలో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో 3 వికెట్లతో మెరిసిన అఫ్గన్ కెప్టెన్ న్యూజిలాండ్ పేస్ టిమ్ సౌథీ పేరిట ఉన్న రికార్డును బద్ధలు కొట్టాడు. 98 మ్యాచుల్లో 13.75 సగటుతో రషీద్ ఈ ఘనతను సొంతం చేసుకున్నాడు.

## దేశీయ మార్కెట్లోకి 116.5 ఇంచుల టీవీ




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: దేశీయ మార్కెట్లోకి అతిపెద్ద టీవీ వచ్చేసింది. ప్రముఖ టెక్నాలజీ సంస్థ వోబ్లీ..116.5 ఇంచుల టెలివిజన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న టీవీల్లో ఇదే అతిపెద్దది కావడం విశేషం. 100 శాతం క్యూలెడ్ డిస్‌ప్లేంమినీలెడ్ డిస్‌ప్లే తయారైన గూగుల్ 5.0 టీవీ ఆండ్రాయిడ్ 14, 240 వాట్ల స్పీకర్ కలిగివుండటంతో థియేటర్‌లో చూసినట్టుగా ఉండనున్నదని కంపెనీ సీఈవో ఆనంద్ దూబే తెలిపారు. అతిపెద్ద టీవీని తయారు చేయడం ఇబ్బందులతో కూడుకున్నదని, ముఖ్యంగా టెక్నాలజీ పరంగా చాలా జాగ్రత్తలు తీసుకున్నట్టు చెప్పారు. దీంతోపాటు 86 ఇంచులు, 98 ఇంచుల్లో కూడా టీవీని అందుబాటులోకి తీసుకొచ్చింది.

## టీసీఎస్ ఉద్యోగుల వేతన పెంపు




ముంబై, సెప్టెంబర్ 2: దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ ఉద్యోగులకు శుభవార్తను అందించింది. 4.5 శాతం నుంచి 7 శాతం వరకు వేతన పెంపును అమలులోకి తీసుకొచ్చింది. అత్యధిక మంది ఉద్యోగుల వేతనాలు పెంచినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ విషయంపై ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించింది. ప్రస్తుత నెల నుంచే పెరిగిన వేతనాలు అమలులోకి వచ్చాయని తెలిపింది. మార్కెట్ పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉండటంతో గత కొన్ని నెలలుగా వాయిదా పడుతూ వచ్చిన వేతన పెంపు ఎట్టకేలకు అమల్లోకి వచ్చాయి.

## పసిడి పరుగు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: పసిడి పరుగులు పెడుతున్నది. రోజుకొక చారిత్రక గరిష్ఠ స్థాయిని తాకుతున్న విలువ మరో శిఖరానికి చేరుకున్నది. వరుసగా ఏడు రోజులుగా పెరుగుతూ వచ్చిన ధర మంగళవారం పదిగ్రాముల ధర మరో రూ.400 ఎగబాకి రూ.1.06 లక్షలకు చేరుకున్నది. అమెరికా ప్రతీకార సుంకాలు విధించడంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించడంతో వీటి ధరలు భారీగా పుంజుకుంటున్నాయి. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల పుత్తడి ధర అంతే పెరిగి రూ.1,05, 200 పలికింది.

# లగ్జరీ ఈవీల ధరలకు రెక్కలు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: లగ్జరీ విద్యుత్తు ఆధారిత వాహనాల (ఈవీ)పై భారీగా పన్ను పెంచాలని వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) కమిటీ సిఫారసు చేసినట్టు ఓ ప్రభుత్వ డాక్యుమెంట్ ప్రకారం తెలుస్తున్నది. రూ.20 లక్షల నుంచి రూ.41 లక్షల వరకు ధర కలిగిన ఈవీలపై జీఎస్టీని 5 శాతం నుంచి 18 శాతానికి పెంచాలని, రూ.41 లక్షలకుపైగా ధర కలిగిన ఈవీలపై 28 శాతం జీఎస్టీ వేయాలని సదరు ప్యానెల్ సూచించినట్టు సమాచారం. అయితే కొత్త జీఎస్టీ విధానంలో 28 శాతం స్లాబును తొలగించాలన్న యోచన ఉండటంతో.. కమిటీ సిఫారసులకు ఆమోదం లభిస్తే రూ.41 లక్షలకుపైగా ధర కలిగిన ఈవీలు 40 శాతం స్లాబులోకి వెళ్లడం ఖాయంగా కనిపిస్తున్నది. దీంతో దేశీయ మార్కెట్‌లో టెస్లా, మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడీ, బీవైడీ తదితర ఈవీల తయారీ సంస్థల అమ్మకాలు పెద్ద ఎత్తునే ప్రభావితమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పైగా ప్రస్తుతం మెజారిటీ కంపెనీల వాహనాలన్నీ భారత్‌లో కంటే విదేశాల్లో తయారై దేశీయ మార్కెట్‌లోకి దిగుమతి అవుతున్నవే. ఈ క్రమంలో పన్ను పోటు తప్పదన్న అభిప్రాయాలు పరిశ్రమ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. కాగా, బుధ, గురువారాల్లో జీఎస్టీ కౌన్సిల్ సమావేశం అవుతున్నది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఈ భేటీ జరుగుతుంది. ఈ సందర్భంగా స్లాబుల తగ్గింపు, ఆయా వస్తూత్పత్తులపై పన్ను రేట్ల సవరణ తదితర కీలక అంశాలపై చర్చించి ఓ నిర్ణయం తీసుకోవచ్చని చెప్తున్నారు. ప్రస్తుతం దేశీయ ఎలక్ట్రిక్ కార్ మార్కెట్‌లో టాటా మోటర్స్ వాటా 40 శాతంగా ఉన్నది. ఆ తర్వాత మహీంద్రా 18 శాతంతో రెండో స్థానంలో ఉన్నది. బీవైడీ, బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడీ తదితర సంస్థలన్నీ ఆ తర్వాత ఉండగా, టెస్లా ఇప్పుడిప్పుడే మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నది. నిజానికి అధిక పన్నులు వేస్తున్నారనే ఎలాన్ మస్క్.. భారతీయ మార్కెట్‌కు ఇన్నాళ్లూ టెస్లాను దూరం పెట్టారు. అయితే కేంద్రం నుంచి భరోసా రావడంతో ఎట్టకేలకు ఇక్కడ బుకింగ్స్‌ను మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో జీఎస్టీ పెంపు ప్రతిపాదనలు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నాయి.

# పారదర్శకతను పెంచి, సంక్లిష్టతలను తగ్గించడానికే జీఎస్టీ సంస్కరణలు

వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) సంస్కరణలకు సంబంధించి కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జీఎస్టీ సంస్కరణలు ఆర్థికవ్యవస్థలో మరింత పారదర్శకత ఉంటుందని, ఈ పన్ను చట్టంలోని సంక్లిష్టతల భారాన్ని తగ్గిస్తాయని, చిన్న వ్యాపారాలు సులభంగా వృద్ధిని సాధించే వీలుంటుందని అన్నారు. మంగళవారం తమిళనాడులోని చెన్నైలో జరిగిన సిటీ యూనియన్ బ్యాంక్ 120వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆర్థిక మంత్రి మాట్లాడుతూ.. బ్యాంకులు క్రెడిట్‌ను విస్తరించడమే కాకుండా, నమ్మకం, సాంకేతికత, పారదర్శకత ద్వారా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఊతం ఇవ్వాలని పిలుపునిచ్చారు. అన్ని బ్యాంకులు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈలు) సకాలంలో, అవసరాలకు అనుగుణంగా నిధులను అందించాలని, బ్యాంకింగ్ సేవలు లేని వారిని దాని పరిధిలోకి తీసుకురా వాలని ఆమె కోరారు. దేశ నిర్మాణంలో ప్రైవేట్ రంగ బ్యాంకుల కీలక పాత్రను ప్రస్తావిస్తూ, షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు ఆస్తి నాణ్యతలో గణనీయంగా మెరుగుపడ్డాయని, స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) దశాబ్ద కనిష్ట స్థాయి 2.3 శాతం వద్ద ఉన్నాయని



అన్నారు. ప్రస్తుతం ఉన్న సవాళ్ల మధ్య మన బ్యాంకులు దీన్ని సాధించడం గొప్ప విషయమని తెలిపారు. ఈ క్రమంలో నిబంధనలను సరళీకృతం చేయడం, సంక్లిష్ట ఖర్చులను తగ్గించడం, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు మరింత అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించే లక్ష్యాలతో తదుపరి తరం సంస్కరణలను తీసుకొచ్చామని పేర్కొన్నారు.

## చివరిగంటలో అమ్మకాలు.. భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్లు

ముంబై, సెప్టెంబర్ 2: దేశీయ స్టాక్ మార్కెట్ల ప్రారంభ లాభాలు ఆవిరైపోయాయి. చివరి గంటలో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. జీఎస్టీ కౌన్సిల్ సమావేశాల నేపథ్యంలో బ్యాంకింగ్, వాహన రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఫలితంగా ప్రారంభంలో 700 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్‌కు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు నష్టాల్లోకి నెట్టింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 206.61 పాయింట్లు కోల్పోయి 80,157.88 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 45.45 పాయింట్లు కోల్పోయి 24,579.60 వద్ద స్థిరపడింది. సూచీల్లో మహీంద్రా అండ్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మోటర్స్, ఎల్అండ్‌టీ, ట్రెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఎస్బీఐ, టాటా స్టీల్, హెచ్‌యూఎల్, రిలయన్స్, బీఈఎల్, టెక్ మహీంద్రా, ఐటీసీ, టీసీఎస్ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే బ్యాంకింగ్, టెలికం, ఆర్థిక సేవలు, టెక్నాలజీ, కన్స్యూమర్ డ్యూరబుల్ రంగ షేర్లు నష్టపోగా..పవర్, యుటిలిటీ, ఎఫ్ఎంసీజీ, మెటల్, రియల్టీ, ఎనర్జీ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి. దేశీయ కరెన్సీ మరింత బలహీనపడింది.

## సీనియర్ సిటిజన్లకు ఎయిర్ ఇండియా భారీ ఆఫర్




ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్‌ఇండియా సీనియర్ సిటిజన్లకు భారీ ఆఫర్ ప్రకటించింది. 60 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న ప్రయాణికులకు ఇది వర్తిస్తుందని, దీని ద్వారా వారు విమాన ప్రయాణాన్ని మరింత సరసమైన ధరలో, సౌకర్యవంతంగా ఆస్వాదించవచ్చని కంపెనీ తెలిపింది. సీనియర్ సిటిజన్లు ఇప్పుడు దేశీయ, అంతర్జాతీయ విమానాలలో ప్రత్యేక రాయితీలు, అదనపు లగేజీ, సులభంగా బుకింగ్ చేసుకునే ఆప్షన్లు పొందవచ్చు. సీనియర్ సిటిజన్లు ఎయిర్‌ఇండియా వెబ్‌సైట్, మొబైల్ యాప్, విమానాశ్రయ కౌంటర్లు లేదా ఎక్కడైన టికెట్ బుకింగ్ సమయంలో 'కన్సెషన్ టైప్' ట్యాబ్ కింద 'సీనియర్ సిటిజన్' ఎంపికను ఎంచుకోవడం ద్వారా డిస్కౌంట్ పొందవచ్చు. బుకింగ్, చెక్-ఇన్ సమయంలో పుట్టిన తేదీతో చెల్లుబాటు అయ్యే ప్రభుత్వం జారీ చేసిన ఫొటో ఐడీ చూపించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా ఎయిర్‌ఇండియా తన అన్ని దేశీయ, అంతర్జాతీయ విమానాలలో ఈ ఆఫర్ అందితోంది. అయితే, ఇది భాగస్వామ్య ఎయిర్‌లైన్స్ నిర్వహించే కోడ్‌షేర్ విమానాలకు వర్తించదు. అలాగే, డిస్కౌంట్లు సీట్ల లభ్యత, ప్రతి క్యాబిన్ తరగతి ఛార్జీ నియమాలకు లోబడి ఉంటాయి. ఎయిర్‌ఇండియా వెల్లడిచిన వివరాల ప్రకారం, అంతర్జాతీయ రూట్లలో టికెట్ బేస్ ధరపై 10 శాతం రాయితీ ఇస్తోంది. ఎకానమీ, ఫస్ట్‌క్లాస్ వరకు అన్ని కేబిన్లకు ఇది అమలవుతుంది. ఒకసారి ప్రయాణ తేదీని మార్చుకోవచ్చు.

## మరింత చౌకగా భారత్‌కు రష్యా ముడిచమురు

ఓవైపు రష్యాతో చమురు వాణిజ్యాన్ని తగ్గించుకోవాలని భారత్‌పై అమెరికా ఒత్తిడి చేస్తున్నది. అయితే అమెరికా బెదిరింపులు, విమర్శలు కొనసాగుతున్నప్పటికీ, భారతీయ చమురు కంపెనీలకు రష్యా ముడి చమురు మరింత చౌకగా లభిస్తోంది. రష్యా గ్రిడ్ నుంచి చమురు ఆఫర్ పొందిన వ్యక్తులు దీని గురించి వెల్లడిస్తూ.. ఇటీవల బ్రెంట్ చమురు కంటే 3-4 డాలర్లు తక్కువకే లభించినట్టు చెప్పారు. ఇవే ధరలు సెప్టెంబర్ ఆఖరి వారంతో పాటు అక్టోబర్ నెల సరఫరాకు కూడా వర్తిస్తుంది. గతవారం రష్యాకు చెందిన ఉరల్స్ గ్రేడ్ చమురు బ్యారెల్‌కు 2.5 డాలర్ల తక్కువకే వచ్చింది. అంతకుముందు జూలైలోనూ 1 డాలర్ డిస్కౌంట్‌తో చమురు లభించింది.



## రష్మికా చిట్టి చెల్లెలు..
# భవిష్యత్ లో హీరోయిన్!



నేషనల్ క్రష్ రష్మికా మందన్నా పరిచయం అవసరం లేని పేరు. పాన్ ఇండియాలో అమ్మడిప్పుడో సంచలనం. వరుస విజయాలతో ఓ బ్రాండ్ గా మారింది. తెలుగు, హిందీలో ఎంత మంది హీరోయిన్లు ఉన్నా? రష్మిక మాత్రం సంథింగ్ స్పెషల్ గా మార్కెట్ లో వెలిగిపోతుంది. స్టార్ హీరోలే అమ్మడితో కలిసి నటించడానికి క్యూ కడుతున్నారు. భవిష్యత్ లో మరిన్ని శిఖరాలను అధిరోహించడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రస్తుతం వరుస ప్రాజెక్ట్ లతో బిజీగా ఉంది. మార్కెట్ కు తగ్గట్టు పారితోషికంగా భారీగానే అందుకుం టుంది. కెరీర్ పరంగా కొన్నాళ్ల పాటు చూసుకునే పనిలేదు. ఇక ఖాళీ సమయం దొరికిందంటే కుటుంబంతో అంతే ఆస్వాదిస్తుంది. మామ్ -డాడ్ తో ఉన్న వీడియోలను నెట్టింట పోస్ట్ చేస్తుంది. అయితే ఈ అమ్మడికి ఓ చిట్టి చెల్లెలు ఉ ందన్నది? పెద్దగా ఎవరికీ తెలియదు. చిట్టి చెల్లెలు అంటే ఏకంగా మేక పిల్ల ఎక్కించుకుని మరీ తిప్పేంత చెల్లెలు ఉంది? అన్నది ఇప్పుడే బయటకు వచ్చింది. రష్మిక వయసు 29 సంవత్సరాలు కాగా...చెల్లితో వయసు వ్యత్యాసం 16 ఏళ్లు ఉంది. ఈ విషయాన్ని రష్మిక స్వయంగా తెలిపింది.

# సినిమా..
## కొట్టుమిట్టాడుతున్న మృణాల్..

హిందీ టీవీ సీరియల్ నటిగా కెరియర్ ఆరంభించి, ఆ తర్వాత నటిగా గుర్తింపు సొంతం చేసుకుంది మృణాల్ ఠాకూర్. తెలుగులో హను రాఘవపూడి దర్శకత్వంలో.. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నేరుగా తెలుగులో నటించిన తొలి చిత్రం సీతారామం. ఈ సినిమాలో సీత పాత్రలో చాలా అద్భుతంగా ఒదిగిపోయి నటించింది మృణాల్ ఠాకూర్. తెలుగులో మొదటి సినిమానే అయినా.. ఆ సినిమాలోని పాత్రతో తెలుగువారి హృదయాలను దోచుకుంది.పైగా తెలుగు ఆడియన్స్ ఈమెను ఓన్ చేసుకున్నారు. తర్వాత నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన హాయ్ నాన్న సినిమాలో కూడా నటించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ హీరోగా వచ్చిన ది ఫ్యామిలీ స్టార్ సినిమాలో కూడా కథానాయికగా నటించింది కానీ ఈ సినిమా పెద్దగా వర్కౌట్ కాలేదు. ఇక ఈ సినిమా తర్వాత ఈమెకు తెలుగులో అవకాశాలు రాలేదు. పైగా దాదాపు ఐదు సంవత్సరాల సినీ కెరియర్లో రెండు చిత్రాలు తప్ప మరో సినిమా ఈమెకు విజయాన్ని అందించలేదు. అటు కథానాయికగా ఎదిగిన బాలీవుడ్ లో కూడా వరుసగా ఎదురు దెబ్బలు తగులుతూనే వచ్చాయి. 2019లో హృతిక్ రోషన్ హీరోగా నటించిన సూపర్ 30 సినిమాతో మంచి బ్రేక్ అందుకున్న ఈమె.. ఆ తర్వాత ఒక్క సినిమాతో కూడా సక్సెస్ అందుకోలేకపోయింది. సూపర్ 30 తరువాత బాలీవుడ్ లో తూఫాన్, బాట్లా హౌస్, జెర్సీ,సెల్ఫీ, గుమ్రా, ఆంఖ్ మిచోలి, పిప్పా ఇలా పలు చిత్రాలు చేసింది. కానీ వరుస పరాజయాలే పలకరించాయి. ఇక ఇప్పుడు సన్నాఫ్ సర్దార్ 2లో కూడా నటించింది. అజయ్ దేవగన్ హీరోగా నటించిన ఈ సినిమా కూడా గత శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాకు ప్రీ రిలీజ్ బస్ పెద్దగా లేకపోవడం వల్ల ఓపెనింగ్స్ రాలేదు. టికెట్ పై 50% ఆఫర్ పెట్టినా కూడా తొలిరోజు థియేటర్లలో జనం కనిపించకపోవడం, పైగా డివైడ్ టాక్ రావడంతో కలెక్షన్లు కూడా సాధించలేకపోయింది.



# మరో కొత్త బిజినెస్‌లోకి సమంత..!



సౌత్ స్టార్ హీరోయిన్ సమంత రీసెంట్ గా సినిమాల విషయంలో చాలా తక్కువగా వార్తల్లో నిలుస్తున్నా రు. సమంతపై వార్తలొస్తున్నప్పటికీ అవి ఆమె సినిమాలకు సంబంధిం చినవి కాకుం డా తన పర్సనల్ విష యాల గురించే ఎక్కువగా వస్తున్నా యి. ఎన్నో ఛాలెంజింగ్ రోల్స్ తో పాటూ చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్లను చేస్తూ వచ్చిన సమంత ఇటీవల ఎలాంటి పెద్ద సినిమాల్లోనూ నటిం చింది లేదు. పెద్ద సినిమాల్లో నటిం చక పోవడమే కాకుండా ఎలాంటి పెద్ద ప్రాజెక్టునీ అనౌన్స్ కూడా చేయలేదు. దీంతో సమంత తర్వాతి ప్రాజెక్టు ఏంటా అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం సమంత ఇప్పుడు మరో కొత్త వెంచర్ లోకి అడుగుపెడుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే నటిగా, నిర్మాతగా, వ్యాపారవేత్తగా సక్సెస్ అయిన సమంత ఇప్పుడు మరో కొత్త బిజినెస్ లోకి ఎంటరవుతున్నారని సమాచారం. అదే లగ్జరీ పెర్ఫ్యూమ్. కేవలం కొత్త పర్ఫ్యూమ్ ను స్టార్ట్ చేయడమే కాకుండా దాన్ని ప్రీమియం లైఫ్ స్టైల్ బ్రాండ్ గా మార్చడానికి సమంత ప్రయత్నిస్తున్నారని సమంత సన్నిహిత వర్గాలంటున్నాయి. ఈ నేపథ్యంలోనే కాన్సెప్ట్ నుంచి బ్రాండింగ్ వరకు ప్రతీ దానిలోనూ సమంత ఇన్వాల్వ్ అవుతూ జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలుస్తోంది. ఫ్యాషన్ రంగంలో ఎప్పుడూ ముందుండే సమంత ఈ ఫ్యాషన్ ప్రాజెక్టును సక్సెస్‌ఫుల్ గా మార్చాలని డిసైడై అందుకు తగ్గ అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తోంది. ఇది సక్సెస్ అయితే సమంత కెరీర్లోనే ఓ కొత్త అధ్యాయం సృష్టించినట్టు అవుతుంది. సినిమాల విషయానికొస్తే సమంత వరుస పెట్టి సినిమాలను ఓకే చేయకుండా స్క్రిప్ట్ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. గతేడాది మొత్తం మయోసైటిస్ వల్ల సినిమాలకు దూరంగా ఉన్న సమంత ఇప్పుడు తన కంబ్యాక్ చాలా స్ట్రాంగ్ గా ఉ ండాలని దానికి తగ్గ కథలనే ఎంచుకుంటున్నారు. ఇప్పటివరకైతే సమంత ఎలాంటి ప్రాజెక్టుకీ సైన్ చేయలేదు కానీ రెండు ప్రాజెక్టులు చర్చల దశల్లో ఉ న్నట్టు తెలుస్తోంది. అందులో ఒక సినిమా తెలుగు కాగా మరోటి బాలీవుడ్ ప్రాజెక్టని, స్టార్ డైరెక్టర్లు ఈ సినిమాలకు దర్శకత్వం వహించనున్నారని అంటున్నారు. అయితే సమంత ఈ రెండు సినిమాలు ఫైనల్ అయ్యే లోపు తన పర్ఫ్యూమ్ బిజినెస్ తో అందరినీ ఎట్రాక్ట్ చేసేలా కనిపిస్తున్నారు.

## అందుకోసమే అయితే
# పొలం పనులు చేస్తా..!

సత్యదేవ్ కెరీర్ జర్నీ గురించి తెలిసిందే. క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా పరిచయ మై ప్రధాన పాత్రలకు ప్రమోట్ అయిన నటుడు. వైవిధ్యమైన నటనతో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నాడు. లెజెండరీ చిరంజీవే సత్యదేవ్ నటనకు ఫిదా అయిన సందర్భం తెలిసిందే. 'గాడ్‌ఫాదర్' లో విలన్ పాత్రకు చిరుయువ నటుడి ఏరికోరి మరీ తీసుకున్నారు. ఎలాంటిపాత్రైనా అవలీలగా పోషించగల నటుడు కావడంతో? ఈతరహా అవకాశాలు అందుకుంటున్నా డు. ఇటీవలే రిలీజ్ అయిన 'కింగ్ డమ్'లో సత్యదేవ్ కీలక పాత్రతో అలరించిన సంగతి తెలిసిందే. విజయ్ దేవరకొండకు అన్నయ్య పాత్రలో ప్రేక్షకుల్ని అలరించాడు. ప్రస్తుతం నటుడిగా కొన్ని సినిమాలతో బిజీగా ఉన్నాడు. నటుడిగా పారితోషికం కూడా మార్కెట్ ఆధారంగా అందుకుం టున్నాడు. అయితే సత్యదేవ్ ముందుకు ఓ ఇంట్రెస్టింగ్ క్వశ్చన్ వెళ్లింది. సినిమాల్లోకి రావడానికి కారణంగా ఫ్యాషన్ తోనా? పారితోషికం కోసమా? అనే ప్రశ్న ఉత్పన్నమైంది. అందుకు సత్యదేవ్ తాను కేవలం ఫ్యాషన్ తో మాత్రమే సినిమాల్లోకి వచ్చినట్లు తెలిపారు. చెప్పుకోవడా నికి సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఉన్నా? మనసంతా సినిమాలపై ఉండటంతో ఉద్యోగం చేస్తూనే సినిమా ప్రయత్నాలు చేసి సక్సెస్ అయినట్లు తెలిపారు. కేవలం డబ్బు కోసమే సినిమాలను అనుకుంటే? తన ఊరి వెళ్లి పొలం పనులు చేసుకున్నా డబ్బు వస్తుందన్నారు.



# నాని టైర్-2 హీరోనా..?



టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని ఇప్పుడు ఓ రేంజ్ లో దూసుకు పోతున్న విషయం తెలిసిందే. వరుస హిట్స్ తో ఫుల్ జోష్ లో ఉన్న ఆయన.. ఇప్పుడు మరిన్ని సినిమాలతో బిజీగా ఉన్నారు. క్రేజీ ప్రాజెక్టులు తన లైనప్ లో చేర్చుకుంటున్నారు. రీసెంట్ గా హిట్-3తో వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ ను సొంతం చేసుకున్న నాని.. అంతకుముందు హ్యాట్రిక్ సాధించారు. దసరా మూవీతో మంచి హిట్ సొంతం చేసుకున్న నేచురల్ స్టార్.. ఆతర్వాత హాయ్ నాన్న మూవీతో మెప్పించారు. మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. అనంతరం సరిపోదా శనివారంతో ఇంకో హిట్ ను సాధించారు. ఇప్పుడు హిట్-3తో వరుసగా నాలుగో విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు ప్యారడైజ్ మూవీ లో నటిస్తూ బిజీగా ఉన్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా.. నాని కెరీర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ తో రూపొందుతోంది. వచ్చే ఏడాది మార్చి 26న రిలీజ్ కానున్న ఆ మూవీపై ఇప్పటికే ఆడియన్స్ లో భారీ అంచనాలు ఉన్నాయి. రీసెంట్ గా లీక్ అయిన నాని లుక్.. వాటిని మరింత పెంచింది. హైదరాబాద్ బ్యాక్ డ్రాప్ లో గ్యాంగ్ స్టర్ డ్రామాగా రూపొందనుంది. ఆ సినిమాతో కూడా హిట్ అందుకుంటారని అంతా అప్పుడే ఫిక్స్ అయిపోయారు. అదే సమయంలో టాలీవుడ్ టైర్-2 హీరోల్లో నాని ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకు న్నారు. అనేక విషయాల్లో నాని టాప్ లో ఉన్నారు. కొంతకాలంగా ఆయన నటిస్తున్న సినిమాలు అన్ని.. స్ట్రాంగ్ ఓపెనింగ్స్ సాధిస్తున్నా యి. బలమైన బాక్సాఫీస్ పుల్ ను చూపిస్తున్నా యి. ఓవర్సీస్ లో కూడా మిలియన్ డాలర్ మార్క్ క్రాస్ చేస్తున్నాయి. అక్కడ కూడా నానికి మంచి ఫ్యాన్‌బేస్ ఉంది. దీంతో ఆయన నటించిన సిని మాలు ఫారిన్ లో కూడా సాలిడ్ కలెక్షన్స్ సాధిస్తున్నాయి. ముఖ్యంగా నేచురల్ స్టార్ సినిమాలు మినిమమ్ గ్యారంటీ అంతా ఫిక్స్ అయ్యేలా క్రేజ్ సంపాదించుకున్నారు. వర్త్ బుల్ మూవీస్ అనేలా స్టాంప్ వేసుకున్నారు. అదంతా ఆయన స్క్రిప్ట్ సెలక్షన్ వల్లే అని చెప్పాలి. ఎందుకంటే ప్రేక్షకులు భావోద్వేగపరంగా కనెక్ట్ అయ్యే కథలు మాత్రమే నాని ఎంచుకుంటున్నారు. అటు కమర్షియల్ గా.. ఇటు కంటెంట్ బేస్డ్ గా సమతుల్యం చేసుకుంటున్నారు. ముఖ్యంగా యాక్టింగ్ తో మెప్పిస్తున్నారు. ఓవరాల్ గా టైర్-2లో ఎవరూ చేరుకోలేని స్టేజ్ కు చేరుకున్నా రని అంతా అంటున్నారు. అదే సమయంలో టైర్-2 కాదు.. నాని టైర్ -1 హీరో అనే చెప్పాలి. సెకెండ్ టైర్ నుంచి ఎప్పుడో ఫస్ట్ టైర్ కు వెళ్లిపోయారు. వరుస హిట్స్ తో తన రేంజ్ ను పెంచుకున్నారు. అందుకే ఇప్పుడు ఆయన టైర్-2 హీరో కాదు.. అంతకుమించే. అయితే నానికి మాత్రం టైర్-2, టైర్-1 వంటి పదాలు అస్సలు నచ్చవన్న విషయం తెలిసిందే.

Edited, Published & Owned by KACHAM SATYANARAYANA. Printed at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS, #3-63, THANEDHARPALLE, GHANPUR STATION MANDAL, THANEDHARPALLE, WARANGAL, TELANGANA - 506143. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | RNI No: TGTEL/25/A1676, Email: vishwambhara.daily@gmail.com